


జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం

## ఆదిలాబాద్
## మంచిర్యాల-కుమరం భీం-నిర్మల్

శనివారం 22 ఆగస్టు 2026 పేజీలు : 8


# వృద్ధులను జాతీయ సంపదగా గుర్తించాలి



హక్కులు, ఆరోగ్యం, ఆర్థిక భద్రతకు ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు చేపట్టాలి

డెమొక్రటిక్ సీనియర్ సిటీజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆళవందార్ వేణు మాధవ్

2

# ఇందిరమ్మ ఇంటి స్లాబ్‌కు పగుళ్లు



- వర్షం వస్తే ఇంట్లోకి నీళ్లు.. లబ్ధిదారురాలి ఆవేదన
- కాంట్రాక్టర్ నిర్లక్ష్యమే కారణమంటున్న బాధితురాలు
- నాణ్యతపై అధికారుల పర్యవేక్షణ ఏదంటూ ప్రశ్నలు
- పాటగూడలో వెలుగులోకి వచ్చిన ఇందిరమ్మ ఇంటి నిర్మాణ లోపం

**ఆసిఫాబాద్ ఆగష్టు 21 ప్రజా జ్యోతి**

పేదలకు సొంతింటి కలను సాకారం చేయాలనే ఉద్దేశంతో ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో నిర్మాణ నాణ్యతపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కొమురం భీం జిల్లా వాంకిడి మండలంలోని పాటగూడ గ్రామపంచాయతీ పరిధిలోనీ గ్రామంలో నిర్మించిన ఓ ఇందిరమ్మ ఇంటి స్లాబ్‌కు పగుళ్లు ఏర్పడటంతో లబ్ధిదారు అయినా బాధితురాలు సోయం సోంబాయి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్లాబ్ నిర్మాణం పూర్తయిన కొన్నిరోజులకే పగుళ్లు ఏర్పడ్డాయని, వర్షం కురిసిన ప్రతిసారీ పైకప్పు నుంచి నీరు ఇంట్లోకి కారుతోందని ఆమె తెలిపారు. దీంతో ప్రభుత్వం అందించిన సొంతింటిలో ప్రశాంతంగా ఉండాల్సిన పరిస్థితికి బదులు వర్షం వస్తే ఆందోళన చెందాల్సి వస్తోందని వాపోయారు. లబ్ధిదారు అయినా బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం..

5

# ఇంటింటికీ ఇందిరమ్మ కుట్టు మిషన్

**మంచిర్యాల, 21,ఆగస్టు (ప్రజాజ్యోతి):** జిల్లాలోని వెనుకబడిన తరగతులకు చెందిన నిరుద్యోగ మహిళలకు ఉపాధి కల్పించే ఉద్దేశంతో ప్రభుత్వం అమలు చేస్తున్న "ఇంటింటా ఇందిరమ్మ కుట్టు మిషన్ పంపిణీ పథకం" కింద 100 శాతం రాయితీపై ఆటోమేటిక్ కుట్టు మిషన్లు అందించనున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి నీరటి రాజేశ్వరి తెలిపారు. అర్హులైన మహిళల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు సెప్టెంబర్ 13వ తేదీలోగా వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు దారుల వయస్సు 18 నుంచి 55 సంవత్సరాల మధ్య ఉండాలని తెలిపారు.

2



# అంతర్రాష్ట్ర సైబర్ నేరగాళ్ల ముఠా అరెస్ట్

- సైబర్ నేరాలకు పాల్పడుతున్న బిహారి సైబర్ ముఠా
- నేషనల్ ఫెర్టిలైజర్స్ పేరుతో ఫ్రాంచైజీ ఇప్పిస్తామని నమ్మించి లక్షల్లో మోసం
- నిందితులపై దేశవ్యాప్తంగా 498 సైబర్ నేరాల ఫిర్యాదులు

14



# వృద్ధులను జాతీయ సంపదగా గుర్తించాలి

## హక్కులు, ఆరోగ్యం, ఆర్థిక భద్రతకు ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు చేపట్టాలి

## డెమొక్రటిక్ సీనియర్ సిటీజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆళవందార్ వేణు మాధవ్

**మంచిర్యాల, 21, ఆగస్టు (ప్రజాజ్యోతి):** వృద్ధులను దేశానికి భారంగా కాకుండా జాతీయ సంపదగా గుర్తించి, వారి హక్కులు, ఆరోగ్యం, ఆర్థిక భద్రతకు ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు చేపట్టాలని డెమొక్రటిక్ సీనియర్ సిటీజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆళవందార్ వేణు మాధవ్ డిమాండ్ చేశారు. వరల్డ్ సీనియర్ సిటిజన్స్ డే సందర్భంగా మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా ఘట్కేసర్ సర్కిల్ పరిధిలోని కొర్రెముల సుప్రభాత్ టౌన్‌షిప్‌లో డెమొక్రటిక్ సీనియర్ సిటీజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీనియర్ సిటిజన్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అసోసియేషన్ ఉపాధ్యక్షులు బంగారి రాజయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆళవందార్ వేణు మాధవ్ మాట్లాడుతూ తెలంగాణలో సుమారు 48 లక్షల మంది, దేశవ్యాప్తంగా సుమారు 16 కోట్ల మంది వృద్ధులు ఉన్నారని తెలిపారు. వృద్ధుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో వారికి అవసరమైన వైద్య, సామాజిక భద్రతా సదుపాయాలను మరింత విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వృద్ధుల పోషణ, సంక్షేమ చట్టం--2007ను పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. పేద వృద్ధులకు ఉచిత మధ్యాహ్న భోజనం అందించాలని, ఆర్టీసీ బస్సుల్లో 50 శాతం రాయితీ కల్పించాలని, రైల్వే టికెట్ రాయితీలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. పుణ్యక్షేత్రాల్లో వృద్ధులకు ఉచిత దర్శనంతో పాటు ఉచిత వసతి సౌకర్యం కల్పించాలని కోరారు. రేషన్ కార్డుల ద్వారా




వృద్ధులకు పౌష్టికాహారం, చిరుధాన్యాలు అందించాలని, ఆసుపత్రుల్లో వృద్ధుల కోసం ప్రత్యేక వార్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. బ్యాంకులు, పోస్టాఫీసులు, ప్రభుత్వ కార్యాలయాల్లో సీనియర్ సిటిజన్ల కోసం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులు, ఈపీఎఫ్ పెన్షన్‌దారులకు కనీస పెన్షన్ రూ.10 వేలు చెల్లించాలని కోరారు. యువత వృద్ధులను గౌరవించి, వారి అనుభవాలను సమాజ అభివృద్ధికి వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆళవందార్ వేణు మాధవ్, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు టి. ప్రభాకర్ గౌడ్, ఉపాధ్యక్షులు బంగారి రాజయ్య, రిటైర్డ్ టీచర్స్ అసోసియేషన్ నాయకులు గుత్తా రవీందర్ రెడ్డి, పెట్టపత్రి మాధవ రెడ్డి, సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులు సత్య నారాయణ, రాజా నర్సు, లక్ష్మీనారాయణ, ప్రభాకర్, మునిందర్ రెడ్డి, శ్రీనివాస్, కొట్టే మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఇంటింటికీ ఇందిరమ్మ కుట్టు మిషన్

## బీసీ మహిళలకు 100 శాతం రాయితీతో ఆటోమేటిక్ కుట్టు మిషన్లు

## జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి నీరటి రాజేశ్వరి

**మంచిర్యాల, 21,ఆగస్టు (ప్రజాజ్యోతి):** జిల్లాలోని వెనుకబడిన తరగతులకు చెందిన నిరుద్యోగ మహిళలకు ఉపాధి కల్పించే ఉద్దేశంతో ప్రభుత్వం అమలు చేస్తున్న "ఇంటింటా ఇందిరమ్మ కుట్టు మిషన్ పంపిణీ పథకం" కింద 100 శాతం రాయితీపై ఆటోమేటిక్ కుట్టు మిషన్లు అందించనున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి నీరటి రాజేశ్వరి తెలిపారు. అర్హులైన మహిళల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు సెప్టెంబర్ 13వ తేదీలోగా వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు దారుల వయస్సు 18 నుంచి 55 సంవత్సరాల మధ్య ఉండాలని తెలిపారు. నిరుద్యోగులు, పేదలు, నిరాదరణకు గురైన వితంతువులు ఒంటరి మహిళలు, వికలాంగులు, అనాథ మహిళలు, టైలరింగ్ శిక్షణ సర్టిఫికెట్ కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుందని వివరించారు. అభ్యర్థులు తెల్ల రేషన్ కార్డు లేదా ఆహార భద్రత కార్డు కలిగి ఉండటంతో పాటు కనీసం 5వ తరగతి ఉత్తీర్ణత సాధించి ఉండాలి. ఆధార్ కార్డు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. కుటుంబ వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షల లోపు ఉండాలని స్పష్టం చేశారు. 2023--24 సంవత్సరంలో బీసీ ఒకేషనల్ స్కీమ్ స్వయం ఉపాధి పథకం కింద ఆర్థిక లబ్ధి పొందిన వారు ఈ పథకానికి అర్హులు కారని తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన అనంతరం సంబంధిత ధ్రువీకరణ పత్రాలను జత చేసి దరఖాస్తును సమర్పించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల అభ్యర్థులు మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో, పట్టణ ప్రాంతాల అభ్యర్థులు సంబంధిత మున్సిపల్



కార్యాలయంలో సెప్టెంబర్ 13లోగా దరఖాస్తులు సమర్పించాలి. ఆన్‌లైన్ దరఖాస్తును సంబంధిత అధికారికి సమర్పించకపోతే దరఖాస్తును పరిగణనలోకి తీసుకోబోమని జిల్లా బీసీ అభివృద్ధి అధికారి నీరటి రాజేశ్వరి స్పష్టం చేశారు.

## భూముల రీ-సర్వే కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలి


### జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. రాములు



**మంచిర్యాల, 21,ఆగస్టు (ప్రజాజ్యోతి):** మంచిర్యాల జిల్లాలో ఎంపిక చేసిన గ్రామాల్లో కొనసాగుతున్న భూముల రీ-సర్వే కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. రాములు సంబంధిత అధికారులను ఆదేశించారు. కోటపల్లి మండలంలోని పారుపల్లి, ఆయేపెల్లి గ్రామాల్లో కొనసాగుతున్న భూముల రీ-సర్వే కార్యక్రమాన్ని మండల తహసీల్దార్ రాఘవేంద్రతో కలిసి ఆయన క్షేత్రస్థాయిలో శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రీ-సర్వే పనుల పురోగతిని, క్షేత్రస్థాయిలో చేపడుతున్న ప్రక్రియను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రీ-సర్వే పనులు క్షేత్రస్థాయిలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా సజావుగా కొనసాగుతున్నాయని తెలిపారు. రీ-సర్వే ప్రక్రియకు రైతులు పూర్తిస్థాయిలో సహకరిస్తున్నారని పేర్కొన్నారు. నిర్దేశిత మార్గదర్శకాలు, విధానాల ప్రకారం రీ-సర్వే పనులను సమర్థవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మందమర్రి, బెల్లంపల్లిలో నేడు కోర్టుల ప్రారంభం

**మంచిర్యాల, ఆగస్టు 21 (ప్రజాజ్యోతి):** జిల్లాలోని మందమర్రి, బెల్లంపల్లి ప్రాంతాల్లో ఆగస్టు 22న నూతన కోర్టులను ప్రారంభించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.వీరయ్య తెలిపారు. రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా పరిపాలన న్యాయమూర్తి నగేష్ భీమపాక చేతుల మీదుగా ఈ కోర్టుల ప్రారంభోత్సవ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మందమర్రి పట్టణంలో ఉదయం 9.30 గంటలకు కోర్ట్ ఆఫ్ జూనియర్ సివిల్ జడ్జ్ కమ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్టును ప్రారంభించనున్నారు. అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు బెల్లంపల్లి పట్టణంలో జూనియర్ సివిల్ జడ్జి కోర్టు భవనాన్ని ప్రారంభించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి పేర్కొన్నారు. కోర్టుల ఏర్పాటుతో ఆయా ప్రాంతాల ప్రజలకు న్యాయ సేవలు మరింత చేరువ కానున్నాయని తెలిపారు.



INVITATION

PRINCIPAL DISTRICT AND SESSIONS JUDGE,
MANCHERIAL DISTRICT

AND

PRESIDENT AND MEMBERS OF BAR ASSOCIATION, BELLAMPALLI

Cordially invite you on the occasion of
INAUGURATION OF

COURT BUILDING FOR JUNIOR CIVIL JUDGE AT BELLAMPALLI,
MANCHERIAL DISTRICT

BY

HON'BLE SRI JUSTICE NAGESH BHEEMAPAKA,
JUDGE, HIGH COURT FOR THE STATE OF TELANGANA,
AND
ADMINISTRATIVE JUDGE OF MANCHERIAL DISTRICT

ON

SATURDAY, THE 22ND DAY OF AUGUST, 2026 AT 12.00 NOON

SRI MERUGU SRINIVAS,
PRESIDENT, BAR ASSOCIATION,
BELLAMPALLI.

SRI A. VEERAIAH,
PRL. DISTRICT AND SESSIONS JUDGE,
MANCHERIAL DISTRICT.

5:12 PM

## వానాకాలం 2026-27 ధాన్యం సేకరణకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలి

**రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర**



**మంచిర్యాల, 21,ఆగస్టు (ప్రజాజ్యోతి):** వానాకాలం 2026-27 ధాన్యం సేకరణకు అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందస్తుగా చేపట్టాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర అధికారులను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల అదనపు కలెక్టర్లు, పౌరసరఫరాల శాఖ అధికారులు, జిల్లా మేనేజర్లతో వానాకాలం 2026-27కు సంబంధించి ధాన్యం సేకరణ, ధాన్యం నిల్వలు, సి.ఎం.ఆర్. బియ్యం సరఫరా తదితర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర మాట్లాడుతూ వానాకాలం 2026-27 ధాన్యం సేకరణకు జిల్లాలో అవసరమైన గోదాములను ముందుగానే గుర్తించి, వాటిని అన్ని విధాలుగా సిద్ధంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. ధాన్యం సేకరణ ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులు, సిబ్బందితో ముందస్తు సమావేశాలు నిర్వహించి, సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని సూచించారు. రైస్ మిల్లర్లు తమ వద్ద ఉన్న సి.ఎం.ఆర్. బియ్యాన్ని త్వరితగతిన ప్రభుత్వానికి అందజేయాలని కమిషనర్ తెలిపారు. నిర్దేశిత గడువులోగా సి.ఎం.ఆర్. బియ్యాన్ని ప్రభుత్వానికి అందజేయని మిల్లర్లపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేశారు. సి.ఎం.ఆర్. బియ్యం బకాయిలను చెల్లించకుండా డిఫాల్ట్ అయిన రైస్ మిల్లర్లపై రెవెన్యూ రికవరీ యాక్ట్ ప్రకారం కఠినంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. బకాయిల వసూళ్లలో ఎలాంటి జాప్యం లేకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా యాసంగి 2022-23కు సంబంధించిన వేలం ధాన్యం బకాయిలను నిర్ణీత గడువులోగా పూర్తిగా చెల్లించాలని తెలిపారు. గడువులోగా బకాయిలు చెల్లించని సంబంధిత వ్యక్తులు, మిల్లర్లపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలోని ఎఫ్.పి. షాపులలో నిల్వ ఉన్న దొడ్డు బియ్యాన్ని నిబంధనల ప్రకారం వేలం వేయడం జరుగుతుందని కమిషనర్ తెలిపారు. ఇందుకు అవసరమైన అన్ని చర్యలను ముందుగానే చేపట్టాలని అధికారులకు సూచించారు. వానాకాలం ధాన్యం సేకరణ ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని, ధాన్యం సేకరణకు అవసరమైన మౌలిక వసతులు, గోదాములు తదితర ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని తెలిపారు. సంబంధిత శాఖల మధ్య సమన్వయంతో పనిచేస్తూ, ప్రభుత్వ ఆదేశాలను ఖచ్చితంగా అమలు చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. రాములు మాట్లాడుతూ జిల్లాలో వరి ధాన్యం సేకరణ ప్రక్రియ సజావుగా సాగేందుకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ధాన్యం సేకరణకు సంబంధించి ముందస్తు ఏర్పాట్లను పూర్తి చేసి, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపడుతు న్నామని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ శ్రీకళ, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రూపారెడ్డి హత్యను తీవ్రంగా ఖండిస్తూ భారీ ర్యాలీ

**ఉపాధ్యాయుల భద్రతకు ప్రత్యేక చట్టం తీసుకురావాలి**

**ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన ట్రస్మా**

**మంచిర్యాల జిల్లాలో ప్రైవేట్ పాఠశాలల బంద్ ప్రశాంతం**



**మంచిర్యాల, 21, ఆగస్టు (ప్రజాజ్యోతి):** నల్గొండ జిల్లా కొండమల్లేపల్లిలో ప్రధానోపాధ్యాయురాలు రూపారెడ్డి దారుణ హత్యకు నిరసనగా తెలంగాణ గుర్తింపు పొందిన పాఠశాలల యాజమాన్యాల సంఘం (ట్రస్మా) రాష్ట్ర సంఘం పిలుపు మేరకు మంచిర్యాల జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలలను శుక్రవారం బంద్ నిర్వహించారు. అనంతరం సుమారు 800 మంది ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు, పాఠశాలల యాజమాన్యాల ప్రతినిధులతో మంచిర్యాలలో భారీ నిరసన ర్యాలీ చేపట్టారు. ర్యాలీ అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శ్రీనివాస్‌రావును కలిసి ట్రస్మా మంచిర్యాల జిల్లా నాయకులు వినతిపత్రం అందజేశారు. రూపారెడ్డి హత్యను తీవ్రంగా ఖండించిన నాయకులు, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా ట్రస్మా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాపోలు విష్ణువర్ధన్‌రావు మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల్లో ఉపాధ్యాయులపై దాడులు ఆందోళనకరంగా పెరుగుతున్నాయని అన్నారు. క్రమశిక్షణలో భాగంగా ఉపాధ్యాయులు విద్యార్థులను మందలించిన సందర్భాల్లో కొంతమంది తల్లిదండ్రులు పాఠశాలలకు వచ్చి గొడవలకు దిగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుల భద్రత కోసం ప్రభుత్వం తక్షణమే 'ఉపాధ్యాయ రక్షణ చట్టం (టీచర్స్ ప్రొటెక్షన్ ఆక్ట్ ) తీసుకురావాలని డిమాండ్ చేశారు. ప్రతి పాఠశాలను 'డ్రగ్-ఫ్రీ స్కూల్ జోన్'లిగా ప్రకటించి, పాఠశాలల పరిసరాల్లో గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాలపై జీరో టాలరెన్స్ విధానం అమలు చేయాలని కోరారు. అత్యవసర పరిస్థితుల్లో పాఠశాలలు వెంటనే పోలీసులను సంప్రదించేందుకు ప్రత్యేక ఎమర్జెన్సీ రెస్పాన్స్ సిస్టమ్ ఏర్పాటు చేయడంతో పాటు పాఠశాలల వేళల్లో పోలీసు పెట్రోలింగ్ నిర్వహించాలని సూచించారు. అలాగే ఉపాధ్యాయులు, పాఠశాలలపై సోషల్ మీడియాలో తప్పుడు, పరువునష్టం కలిగించే ప్రచారం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులు భయం లేకుండా, గౌరవంగా విధులు నిర్వర్తించే వాతావరణాన్ని కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. తమ విజ్ఞప్తిని రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించాలని కలెక్టర్ కార్యాలయ అధికారులను కోరినట్లు తెలిపారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లల ప్రవర్తనపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని నాయకులు సూచించారు. సెల్‌ఫోన్ దుర్వినియోగం, మాదకద్రవ్యాలు, మద్యపానం వంటి చెడు అలవాట్లు యువత భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని అన్నారు. వీటిని అరికట్టేందుకు ప్రభుత్వం, పోలీసు శాఖ, విద్యాసంస్థలు సంయుక్తంగా తరచుగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. ట్రస్మా జిల్లా అధ్యక్షులు దామెర్ల సిద్దయ్య మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులపై బెదిరింపులు, దాడులు, వేధింపులు చోటుచేసుకోవడం విద్యారంగానికే తీవ్ర ముప్పని అన్నారు. రూపారెడ్డి హత్య ఒక్క కుటుంబానికి జరిగిన విషాదం కాదని, విద్యారంగంలో పనిచేస్తున్న ప్రతి ఒక్కరి భద్రతకు సంబంధించిన తీవ్రమైన సమస్యగా భావిస్తున్నామని తెలిపారు. ఉపాధ్యాయులు భయంతో విధులు నిర్వహించాల్సిన పరిస్థితి రాకుండా, గురువు నిర్భయంగా బోధించే వాతావరణం, పాఠశాలల యాజమాన్యాలు ఎలాంటి భయాందోళనలు లేకుండా విద్యాసంస్థలను నిర్వహించే పరిస్థితిని ప్రభుత్వం కల్పించాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రైవేట్ ఉపాధ్యాయుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించి ప్రభుత్వ స్థాయిలో కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రూపారెడ్డి ఘటనను ఒక్క వ్యక్తిపై జరిగిన దాడిగా కాకుండా యావత్ గురుపరంపరపై జరిగిన దాడిగా భావిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాపోలు విష్ణువర్ధన్‌రావు, జిల్లా అధ్యక్షులు దామెర్ల సిద్దయ్య, జిల్లా కోశాధికారి ఉదారి చంద్రమోహన్‌గౌడ్, రాష్ట్ర నాయకులు కస్తూరి పద్మచరణ్, యార్లగడ్డ బాలాజీ, రాం వేణు, అఖిలేందర్‌సింగ్, కె.ప్రవీణ్‌కుమార్, గోపతి సత్తయ్య, జిల్లా నాయకులు ఉస్మాన్‌పాషా, పోలు శ్రీనివాస్, మద్దెర్ల శ్రీనివాస్, పెంచాల శ్రీధర్, మంచిర్యాల పట్టణ ప్రధాన కార్యదర్శి సాధిక్‌భాషా, పట్టణ కోశాధికారి మోహన్‌వర్మ, విక్రంరావు, హాయ్ మధుఖాన్, జాన్‌థామస్, బిజ్జు కురివిళ్ల, జహీరా ఖాతున్, బెల్లంపల్లి పట్టణ అధ్యక్షుడు రాజలింగు, ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, కోశాధికారి శేషు, మందమరి మండల అధ్యక్షుడు పెద్దపల్లి ఉప్పలయ్య, వై.కరుణాకర్‌రెడ్డి, కృష్ణమోహన్‌తో పాటు వివిధ మండలాలకు చెందిన పాంశాలల యాజమాన్యాలు, ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# నెల్కి వెంకటాపూర్ 'సహకార' బాధ్యతల స్వీకారం



**దండేపల్లి, ఆగస్టు 21(ప్రజాజ్యోతి):** నెల్కి వెంకటాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పిఎసిఎస్) నూతన పాలక వర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. సంఘం నూతన చైర్మన్‌గా ముత్యాల శ్రీనివాస్, వైస్ చైర్మన్‌గా బిల్లకూరి శంకరయ్య పదవీ బాధ్యతలు స్వీకరించారు. వీరితో పాటు పాలక వర్గ ఇతర సభ్యులు కూడా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ అక్కల వెంకటేశ్వర్లు, జిల్లా నాయకుడు గడ్డం త్రిమూర్తి ముఖ్య అతిథులుగా హాజరై నూతన పాలక వర్గానికి సాలువతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

**రైతుల సంక్షేమమే ధ్యేయం:**

అనంతరం నూతన చైర్మన్, వైస్ చైర్మన్‌లు మాట్లాడుతూ... రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ సహకార సంఘాన్ని ప్రగతి పథంలో నడిపిస్తామని స్పష్టం చేశారు. సంఘం ద్వారా లభించే రుణాలు, ఇతర సేవలను సకాలంలో రైతులకు అందిస్తామని తెలిపారు. తమపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిన నాయకులకు, సంఘం సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.?ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచులు, నాయకులు, సంఘం సిబ్బంది, రైతు ప్రతినిధులు,స్థానిక గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రాజకీయ ఖైదీలందరినీ విడుదల చేయాలి

**ఆగస్టు 29 న హైదరాబాద్‌లో ధర్నా**


**మంచిర్యాలలో కరపత్రం, వాల్‌పోస్టర్ ఆవిష్కరణ**

**మంచిర్యాల, 21,ఆగస్టు (ప్రజాజ్యోతి):** రాజకీయ ఖైదీలందరినీ విడుదల చేయాలని, జైళ్లలో నిర్బంధించిన ఆదివాసీలపై కేసులను ఎత్తివేయాలని, ప్రజా సంఘాల నాయకులు, మేధావులపై పెట్టిన అక్రమ ఉపా కేసులను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 29న హైదరాబాద్‌లో నిర్వహించనున్న ధర్నాకు సంబంధించిన కరపత్రం, వాల్‌పోస్టర్‌ను శుక్రవారం మంచిర్యాల ఐబీ చౌరస్తాలో ఆవిష్కరించారు. రాజకీయ ఖైదీల విడుదల ఐక్యవేదిక ఆధ్వర్యంలో పౌర, ప్రజా హక్కుల సంఘాల నాయకులు ఈ కార్యక్రమంను నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ప్రభుత్వాలు ప్రజాస్వామ్య వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ రాజ్యాంగం కల్పించిన హక్కులు, సంక్షేమ విధానాలను విస్మరిస్తున్నాయని ఆరోపించారు. ప్రజల జీవించే హక్కు, జీవనోపాధి హక్కుల కోసం దేశంలో ఎనిమిది దశాబ్దాలుగా అనేక ఉద్యమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా అడవులు, అడవుల చుట్టూ ఉన్న మైదాన ప్రాంతాలు ప్రజా ఉద్యమాలకు కేంద్రాలుగా మారాయని, లక్షలాది ఆదివాసీలు జల్, జంగల్, జమీన్, ఆత్మగౌరవం కోసం పోరాడుతున్నారని అయితే ఆ ఉద్యమాలపై ప్రభుత్వాల అణచివేత నిరంతరం కొనసాగుతోందని అన్నారు. దేశవ్యాప్తంగా, తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల్లో మావోయిస్టులనే ఆరోపణలతో ఎంతోమంది జైళ్లలో మగ్గుతున్నారని తెలిపారు. వారిలో కొందరు ఏళ్ల తరబడి విచారణ ఖైదీలుగానే ఉన్నారని, బెయిల్‌పై విడుదల కావడం కూడా కష్టంగా మారిందన్నారు. ఒకవైపు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ఆయా రాష్ట్రాల పోలీసు ఉన్నతాధికారులు మావోయిస్టు ఉద్యమం ఇక ఏమీ మిగలలేదని, ముగిసిపోయిందని ప్రకటిస్తున్నా రని గుర్తుచేశారు. గత ఏడాది కాలంగా ఉద్యమాన్ని వీడి బయటకు వచ్చిన వందలాది మంది మావోయిస్టు నాయకులు, కార్యకర్తలపై కేసులు తొలగించకపోయినా అరెస్టు చేయకుండా ఇళ్లకు పంపించిన సందర్భాలు ఉన్నాయని తెలిపారు. అదే ఉద్యమానికి సహకరించా రనే కారణంతో వందలాది మంది సాధారణ కార్యకర్తలను మాత్రం విచారణ ఖైదీలుగా ఏళ్ల తరబడి జైళ్లలో ఉంచడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. జైళ్లలో ఉన్న వారిలో సుమారు 90 శాతం మంది ఆదివాసీలే ఉన్నారని నాయకులు పేర్కొన్నారు. మావోయిస్టు ఉద్యమం ముగిసిందని పార్లమెంటులో కేంద్ర హోంమంత్రి ప్రకటించిన నేపథ్యంలో, ప్రస్తుతం జైళ్లలో ఉన్న వారిపై నమోదైన కేసులను పునఃసమీక్షించి రద్దు చేసి, వారిని వెంటనే విడుదల చేయాల్సిన అవసరం ఉందన్నారు. రాజకీయ ఖైదీలందరినీ విడుదల చేయాలని, జైళ్లలో నిర్బంధించిన ఆదివాసీలపై కేసులను ఎత్తివేసి విడుదల చేయాలని, ప్రజా




సంఘాల నాయకులు, మేధావులపై పెట్టిన అక్రమ ఉపా కేసులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమకారులు, ముస్లిం మైనారిటీలపై నమోదు చేసిన అక్రమ కేసులను ఎత్తివేయాలని, ఉపా చట్టాన్ని రద్దు చేయాలని, జాతీయ దర్యాప్తు సంస్థను రద్దు చేయాలని కోరారు. ఈ డిమాండ్ల సాధన కోసం ఆగస్టు 29, 2026 శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు హైదరాబాద్ ఇందిరాపార్క్‌లో భారీ ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ధర్నాకు పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ లక్ష్మణ్ గడ్డం అధ్యక్షత వహించనున్నారు. ఈ ధర్నాలో రాజకీయ ఖైదీల విడుదల ఐక్యవేదిక కన్వీనర్ ప్రొఫెసర్ హరగోపాల్, ప్రొఫెసర్ మాడభూషి శ్రీధర్, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్, భారత కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శి జాన్ వెస్లీ, భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు-లెనినిస్టు న్యూడెమోక్రసీ నాయకులు సాధినేని వెంకటేశ్వరరావు, గుమ్మడి నర్సయ్య, మాజీ ఎమ్మెల్యే విమలక్క, మహిళా హక్కుల ఉద్యమ నాయకురాలు సంధ్య తదితరులు పాల్గొని ప్రసంగించనున్నట్లు తెలిపారు. ప్రజలు, ప్రజాస్వామికవాదులు, కార్మికులు, విద్యార్థులు, కర్షకులు, మేధావులు పెద్ద సంఖ్యలో పాల్గొని రాజకీయ ఖైదీల విడుదల కోసం జరిగే ధర్నాను విజయవంతం చేయాలని నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ కరపత్రం, వాల్‌పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో పౌర హక్కుల సంఘం తెలంగాణ సహాయ కార్యదర్శి మాదన కుమారస్వామి, పౌర హక్కుల సంఘం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కమిటీ కన్వీనర్ బుద్దె సత్యం, కో-కన్వీనర్లు ఆయిందాల సారయ్య, జె. పోషం, తుడుం దెబ్బ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంజి రాజన్న, మంచిర్యాల జిల్లా అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య కార్యదర్శి ఆడెపు సమ్మయ్య, తెలంగాణ మున్సిపల్ కాంట్రాక్టు కార్మికుల సంఘం గౌరవ అధ్యక్షుడు దేవి సత్యం, తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సమ్మ్మ రాజన్న, ప్రజా సంఘాల నాయకుడు కె. రాంరెడ్డి, నేతకాని సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం స్వామి తదితరులు పాల్గొన్నారు.

# ఏసీబీ వలలో పంచాయతీ కార్యదర్శి 13వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన వైనం



**జన్నారం,ఆగస్ట్21(ప్రజాజ్యోతి)**నూతన ఇంటి నిర్మాణ అనుమతి కోసం రూపాయలు 13000 లంచం తీసుకుంటున్న పంచాయతీ కార్యదర్శి ఏసీబీ అధికారుకు పట్టుబడ్డారు.జన్నారం మండలం లింగయ్య పల్లె గ్రామ పంచాయతీ కార్యదర్శి వరలక్ష్మి అదే గ్రామానికి చెందిన తిరుపతి అనే వ్యక్తి నూతన ఇంటి నిర్మాణ అనుమతి కోసం పంచాయతీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోగా, అనుమతి ఇవ్వాలంటే రూపాయలు 15 వేలు లంచం డిమాండ్ చేసినట్లు సమాచారం. చివరకు 13వేలకు బేరం కుదరడంతో, శుక్రవారం రోజున నగదు తీసుకొని పంచాయతీ కార్యదర్శి వరలక్ష్మి వద్ద కు వెళ్లగా,నగదు రూపకంగా వద్దని ఫోన్ పే రూపకంగా తన స్నేహితుల ఖాతా కు బదిలీ చేయాలని కండీషన్ పెట్టడంతో బాధితుడు తిరుపతి ఏసీబీ ని ఆశ్రయించాడు.ఈ క్రమంలో ఏసీబీ డిఎస్పి మధు ఆధ్వర్యంలో అధికారులు పక్కా ప్రణాళికతో దాడి చేశారు. రూపాయలు 13 వేలు నగదు బదిలీ అయిన అనంతరం లింగయ్య పల్లి పంచాయతీ కార్యదర్శి వరలక్ష్మి అధికారులు అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు.ఈ సందర్భంగా ఏసీబీ డిఎస్పి మధు మాట్లాడుతూ ఎవరైనా అధికారులు లంచం అడిగితే తమకు సమాచారం అందించాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

# మూడు ఇసుక రీచ్‌లు అందుబాటులోకి ఆన్‌లైన్‌లో ఇసుక ఆర్డర్ చేసుకోవచ్చు

**గనులు, భూగర్భ శాఖ సహాయ సంచాలకులు**

**మంచిర్యాల, 21,ఆగస్టు (ప్రజాజ్యోతి):** జిల్లాలో అధికారికంగా నిర్వహిస్తున్న ఇసుక రీచ్‌ల ద్వారా ప్రజలకు ఇసుక అందుబాటులో ఉందని గనులు, భూగర్భ శాఖ సహాయ సంచాలకులు తెలిపారు. ప్రస్తుతం ముల్కల్ల ఇసుక రీచ్, ఇందారం ఇసుక రీచ్, బతుకమ్మ వాగు ఇసుక రీచ్‌లు ప్రజలకు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. జిల్లా ఇసుక వాహనం సేవల ద్వారా ప్రజలు ఆన్‌లైన్ లో ఇసుకను ఆర్డర్ చేసుకోవచ్చని తెలిపారు.మండలాల వారీగా ఆయా ప్రాంతాలకు సమీపంలోని ఇసుక రీచ్‌ల నుంచి ఇసుకను ఆర్డర్ చేసుకునే అవకాశం కల్పించినట్లు అధికారులు వెల్లడించారు. భీమారం, జైపూర్ మండలాల ప్రజలు ఇందారం ఇసుక రీచ్ నుంచి ఇసుకను పొందవచ్చని, అదేవిధంగా బెల్లంపల్లి, కాసిపేట, తాండూర్, మంచిర్యాల, నస్పూర్, హాజీపూర్, దండేపల్లి, మందమర్రి, లక్సెట్టిపేట మండలాల ప్రజలు ముల్కల్ల ఇసుక రీచ్ నుంచి ఇసుకను ఆర్డర్ చేసుకోవచ్చని తెలిపారు .భీమారం, చెన్నూర్, కోటపల్లి మండలాల ప్రజలు బతుకమ్మ వాగు ఇసుక రీచ్ నుంచి అవసరమైన ఇసుకను ఆన్‌లైన్ ద్వారా ఆర్డర్ చేసుకోవచ్చని గనులు, భూగర్భ శాఖ అధికారులు తెలిపారు. ప్రజలు అధికారిక ఇసుక వాహనం సేవలను వినియోగించుకుని ఇసుకను పొందాలని సూచించారు.

# మండలంలో పర్యటించిన కలెక్టర్ కుమార్ దీపక్


**కిష్టాపూర్ పాఠశాలకు 100 డ్యూయల్ డెస్క్ బెంచీలు మంజూరు**



**జన్నారం,ఆగస్ట్21(ప్రజాజ్యోతి)**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ శుక్రవారం రోజున జన్నారం మండలంలో పర్యటించారు. మండలంలోని కిష్టాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, విద్యాబోధన ఇతర అంశాలను పరిశీలించారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని, తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. విద్యార్థులకు సకాలంలో మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. విద్యార్థుల సౌకర్యార్థం 100 డ్యూయల్ డెస్క్ బెంచీలను మంజూరు చేశారు.అనంతరం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ఓ.పి. రిజిస్టర్, వార్డు, మందుల లభ్యత, వైద్య సేవలను పరిశీలించారు.ప్రభుత్వ ఆసుపత్రులలో, ప్రైవేట్ ఆసుపత్రులలో జరుగుతున్న ప్రసవాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వైద్యులు, స్టాఫ్ నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్ల హాజరు, అందుబాటులో ఉన్న వైద్య సేవలపై వివరాలు పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. మండల తహసిల్దార్ తో మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా నో మ్యాపింగ్, అనుమలిస్ వారికి నిబంధనల ప్రకారం నోటీసుల జారీ ప్రక్రియ త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ విద్యా సంస్థలు, సంక్షేమ వసతి గృహాలు, ఆరోగ్య కేంద్రాలలో ప్రజలకు మెరుగైన సేవలు అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో తహశీల్దార్ బక్కయ్య,ఎంపీడీఓ ఉమర్ షరీఫ్,గిర్దావర్ వెంకటేశం, డాక్టర్ ఉమాశ్రీ,కిష్టాపూర్ సర్పంచ్ వాసాల నరేష్, తదితరులు పాల్గొన్నారు

# ఇందిరమ్మ ఇంటి స్లాబ్‌కు పగుళ్లు

వర్షం వస్తే ఇంట్లోకి నీళ్లు.. లబ్ధిదారురాలి ఆవేదన
కాంట్రాక్టర్ నిర్లక్ష్యమే కారణమంటున్న బాధితురాలు
నాణ్యతపై అధికారుల పర్యవేక్షణ ఏదంటూ ప్రశ్నలు
పాటగూడలో వెలుగులోకి వచ్చిన ఇందిరమ్మ ఇంటి నిర్మాణ లోపం



**ఆసిఫాబాద్ ఆగస్టు 21 ప్రజా జ్యోతి** పేదలకు సొంతింటి కలను సాకారం చేయాలనే ఉద్దేశంతో ప్రజా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో నిర్మాణ నాణ్యతపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కొమురంభీం జిల్లా వాంకిడి మండలంలోని పాటగూడ గ్రామపంచాయతీ పరిధిలోని గ్రామంలో నిర్మించిన ఓ ఇందిరమ్మ ఇంటి స్లాబ్‌కు పగుళ్లు ఏర్పడటంతో లబ్ధిదారు అయినా బాధితురాలు సొయం సోంబాయి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్లాబ్ నిర్మాణం పూర్తయిన కొన్నిరోజులకే పగుళ్లు ఏర్పడ్డాయని, వర్షం కురిసిన ప్రతిసారీ పైకప్పు నుంచి నీరు ఇంట్లోకి కారుతోందని ఆమె తెలిపారు. దీంతో ప్రభుత్వం అందించిన సొంతింటిలో ప్రశాంతంగా ఉండాల్సిన పరిస్థితికి బదులు వర్షం వస్తే ఆందోళన చెందాల్సి వస్తోందని వాపోయారు.

**స్లాబ్‌కు పగుళ్లు.. ఇంట్లోకి వర్షపు నీరు**

లబ్ధిదారు అయినా బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. ఇందిరమ్మ ఇంటి నిర్మాణంలో భాగంగా స్లాబ్ వేసేందుకు ఒక ట్రాక్టర్ ఇసుక, ఒక ట్రాక్టర్ కంకర, సుమారు 25 బస్తాల సిమెంట్ వినియోగించినట్లు తెలిపారు. అయితే స్లాబ్ నిర్మాణ సమయంలో నాణ్యతా ప్రమాణాలను సక్రమంగా పాటించలేదని ఆమె ఆరోపించారు. నిర్మాణ పనుల్లో నాణ్యతపై కాంట్రాక్టర్ తగిన శ్రద్ధ చూపకపోవడంతోనే స్లాబ్‌కు పగుళ్లు ఏర్పడ్డాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం పగుళ్ల ద్వారా వర్షపు నీరు ఇంట్లోకి చేరడంతో ఇంట్లోని సామగ్రి తడిసిపోవడంతో పాటు కుటుంబ సభ్యులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

**డబ్బుల వ్యామోహంతో నాసిరకం పనులా?**

ఇందిరమ్మ ఇంటి నిర్మాణంలో ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలు పాటించాల్సి ఉండగా, పనుల్లో వాటిని పట్టించుకోలేదని బాధితురాలు, స్థానికులు ఆరోపిస్తున్నారు. నిర్మాణానికి అవసరమైన సామగ్రి వినియోగించినప్పటికీ పనుల నాణ్యతపై పర్యవేక్షణ లేకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని ఆమె పేర్కొన్నారు. డబ్బుల వ్యామోహంతో కాంట్రాక్టర్ నాసిరకంగా పనులు చేపట్టారని ఆరోపిస్తూ, అధికారులు పూర్తిస్థాయిలో విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

**అధికారుల పర్యవేక్షణపై ప్రశ్నలు**

ప్రభుత్వం పేదలకు నాణ్యమైన ఇళ్లను అందించాలనే లక్ష్యంతో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోంది. ప్రతి దశలోనూ నిర్మాణ పనులను అధికారులు పర్యవేక్షించాల్సి ఉంటుంది. అయితే పాటగూడలో నిర్మించిన ఇంటి స్లాబ్ రోజుల్లోనే పగుళ్లకు గురికావడం అధికారుల పర్యవేక్షణ తీరుపై ప్రశ్నలు తలెత్తేలా చేస్తోంది. నిర్మాణ సమయంలోనే నాణ్యతను పరిశీలించి ఉంటే ప్రస్తుతం ఇలాంటి పరిస్థితి వచ్చేది కాదని గ్రామస్థులు అభిప్రాయపడుతున్నారు.

**వర్షాకాలంలో మరింత ఇబ్బందులు**

ప్రస్తుతం వర్షాకాలం కావడంతో స్లాబ్‌కు వచ్చిన పగుళ్ల ద్వారా నీరు ఇంట్లోకి చేరుతుండటంతో లబ్ధిదారురాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పగుళ్లు మరింత పెరిగితే పరిస్థితి ఏమిటనే ఆందోళన కుటుంబ సభ్యుల్లో నెలకొంది. చిన్నపాటి మరమ్మతులతో సమస్య పరిష్కారమవుతుందా, లేక స్లాబ్‌ను పూర్తిగా పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలా అనే విషయాన్ని అధికారులు నిపుణులతో పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు.

**క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకోవాలి**

పాటగూడలోని ఇందిరమ్మ ఇంటిని సంబంధిత అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలించాలని లబ్ధిదారు సొయం సోంబాయి కోరుతున్నారు. స్లాబ్‌కు పగుళ్లు రావడానికి అసలు కారణాలను సాంకేతికంగా పరిశీలించి, నిర్మాణంలో నాణ్యత లోపం ఉన్నట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే స్లాబ్ మరమ్మతులు చేపట్టి వర్షపు నీరు ఇంట్లోకి రాకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

**నాణ్యతకు పెద్దపీట వేయాలి**

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని గ్రామస్థులు అంటున్నారు. పేదల కోసం ప్రభుత్వం మంజూరు చేస్తున్న ఇళ్లు భవిష్యత్‌లో వారికి భద్రమైన నివాసంగా ఉండేలా నిర్మాణ పనులను అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని కోరుతున్నారు. కేవలం ఇల్లు మంజూరు చేయడంతో ప్రభుత్వ బాధ్యత పూర్తికాదని, నిర్మాణం పూర్తయ్యే వరకు నాణ్యతను పర్యవేక్షించి లబ్ధిదారులకు ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని పేర్కొన్నారు. పాటగూడ ఘటనపై అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకుని సొయం సోంబాయి కుటుంబానికి న్యాయం చేయాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

# కబ్జా కు గురైన చెరువును కాపాడాలని వినతి




## చెరువులో మోటార్లు తొలగించాలని ధర్నా

**జన్నారం,ఆగస్ట్21(ప్రజాజ్యోతి)**జన్నారం మండలంలోని రేండ్ల గూడ గ్రామంలోని కబ్జా కు గురైన అల్లం చెరువును కాపాడాలని,కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆ గ్రామానికి చెందిన కొందరు శుక్రవారం రోజున తహశీల్దార్ బక్కయ్య కు వినతిపత్రం అందజేశారు. అనంతరం మండల కేంద్రంలోని ఇరిగేషన్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జన్నారం మండలంలోని రేండ్లగూడ గ్రామంలో ఉన్న 160,161 సర్వే నెంబర్ లో ఉన్న దాదాపు 24 ఎకరాల అల్లం వారి కుంట ను కబ్జా చేశారని, కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకొని కబ్జాకు గురైన చెరువును కాపాడాలని డిమాండ్ చేశారు. అలాగే కబ్జా చేసిన చెరువులో ఉన్న మోటార్లను తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సముద్రాల శంకర్,దాసరి తిరుపతి,మధు సుధాకర్,దస్తగిరి,తదితరులు పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్న పీ సీ ఆర్ ఫౌండేషన్



**జన్నారం,ఆగస్ట్21(ప్రజాజ్యోతి)**జన్నారం మండల కేంద్రంలో గత కొన్ని రోజులుగా మతిస్థిమితం లేకుండా తిరుగుతున్న వ్యక్తికి పీ సీ ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గుండు గీయించి, స్నానం పోసి, కొత్త దుస్తులు అందజేసి, భోజనం పెట్టి మానవత్వం చాటుకున్నారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షుడు ముడుగు ప్రవీణ్ మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారికి సహాయం చేయడం,నిరాదరణకు గురవుతున్న వారికి అండగా నిలవడం,సేవా కార్యక్రమాలు చేయడమే పీ సీ ఆర్ ఫౌండేషన్ లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు మున్వర్ అలీ ఖాన్,నోముల రాజకుమార్, దేవయ్య, కొత్త శ్రీనివాస్, పుత్తూరు శ్రీనివాస్, బెడద గోపాల్ ,సాయి, గోలి చందు తదితరులు పాల్గొన్నారు

## ఐటీడీఏ పీఓ సుడిగాలి పర్యటన

గిరిజన గ్రామాల సమస్యలపై ఆరా



**ఆసిఫాబాద్ ప్రతినిధి ఆగస్టు 21 ప్రజాజ్యోతి** ఐటీడీఏ ఉట్నూర్ ప్రాజెక్ట్ అధికారి మంద మకరందు శుక్రవారం తిర్యాణి మండలంలోని గిరిజన గ్రామాల్లో సుడిగాలి పర్యటన చేపట్టారు. దంతన్‌పల్లి, పంగడి మాధర, గోవెన, మార్కగూడ గ్రామాలను సందర్శించి అక్కడి సమస్యలు నేరుగా అడిగి తెలుసుకున్నారు. దంతన్‌పల్లిలో మూంపునకు గురైన ఆశ్రమ పాఠశాలను పునఃప్రారంభించాలని గ్రామస్తులు కోరగా, దీనిపై సమగ్ర నివేదికను వెంటనే సమర్పించాలని సంబంధిత డీఈని పీఓ ఆదేశించారు. పాఠశాల పునఃస్థాపనకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.పంగడి మాధరలో రైతు వేదిక వద్ద జరిగిన సమావేశంలో మారుమూల గ్రామాలకు మెరుగైన వైద్య సేవల కోసం పీహెచ్‌సీ ఏర్పాటు చేయాలని సర్పంచులు కోరారు. గోవెన, మార్కగూడ తదితర గ్రామాలకు రోడ్డు కనెక్టివిటీ కల్పించాలని ప్రజలు విజ్ఞప్తి చేశారు. సమస్యలను సంబంధిత శాఖలతో సమన్వయం చేసి పరిష్కరిస్తామని పీఓ స్పష్టం చేశారు. పంగడి మాధర ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేసిన పీఓ.. విద్యార్థుల హాజరు, విద్యా ప్రమాణాలు, మౌలిక వసతులపై ఆరా తీశారు. పదో తరగతి విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. ఫలితాల మెరుగుదలకు నెల రోజుల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించి, నిర్దిష్ట లక్ష్యాలతో బోధన చేపట్టాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. చింతల మాదార జలపాతాన్ని సందర్శించిన పీఓ.. అక్కడి గిరిజనుల సమస్యలను స్వయంగా తెలుసుకున్నారు. సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ఈ పర్యటనలో డీడీ జాదవ్ అంబాజీ, ఏసీఎంఓ ఉద్ధవ్, ఎంపీడీఓ, తహసీల్దార్, సర్పంచ్ రాధాబాయి, అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఎఫ్పీఓలో సభ్యత్వం తీసుకోండి.. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోండి . పీఏసీఎస్ ఇన్చార్జి సీఈవో అనిల్ కుమార్...



తాండూర్ ఆగస్టు 21 (ప్రజాజ్యోతి తాండూర్ సాగు ఖర్చులు తగ్గించి రైతులకు మెరుగైన ఆదాయం అందించేందుకు ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ - ఎఫ్పీఓ గొప్ప అవకాశమని పీఏసీఎస్ సీఈవో అనీల్ కుమార్ అన్నారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల సహకారంతో ఏర్పాటు చేసిన ఎఫ్పీఓలో రైతులు ఈ నెల 25వ తేదీలోగా సభ్యులుగా చేరాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఎఫ్పీఓ ద్వారా రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు తక్కువ ధరకు అందుబాటులో ఉంటాయని, అదేవిధంగా రైతులు పండించిన పంటలను సమిష్టిగా మార్కెటింగ్ చేసి మెరుగైన ధరలు పొందే వీలు కలుగుతుందని తెలిపారు. సభ్యత్వానికి అర్హతలు ఆధార్ కార్డు, పట్టాదారు పాస్ బుక్ జిరాక్స్, రూ. 2, 000 వాటా సొమ్ము చెల్లించాల్సి ఉంటుంది. ప్రతి వాటాదారుడికి కేంద్ర ప్రభుత్వం తరపున మరో రూ. 2,000 వాటా సొమ్మును అదనంగా అందజేస్తారని వివరించారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అనీల్ కుమార్ కోరారు. మరిన్ని వివరాలకు తాండూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో సీఈవోను సంప్రదించాలని సూచించారు.

## పోచమ్మ దేవాలయం విగ్రహ పునఃప్రతిష్ఠాపన వేడుకలు ప్రారంభం



మంచిర్యాల, ఆగస్టు 21 (ప్రజాజ్యోతి): మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ కాలనీ వాటర్ ట్యాంక్ ఏరియాలోని శ్రీ పోచమ్మ దేవాలయంలో అమ్మవారి విగ్రహ పునఃప్రతిష్ఠాపన మహోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ గౌరవ అధ్యక్షుడు, కార్పొరేటర్ బండారి సుధాకర్, ఆలయ కమిటీ అధ్యక్షుడు అర్కాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా వేద పండితులు బుడి అరుణ్ శర్మ, బుడి అనుదీప్ శర్మ, సుబ్బ అభిషేక్ శర్మ, బేదాంతు సచిన్ శర్మ, గణేష్ శర్మల ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. అనంతరం పాలపొరక, అమ్మవారి విగ్రహంతో శోభాయాత్ర నిర్వహించారు. కాలనీలోని వీధుల గుండా సాగిన శోభాయాత్రలో భక్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు బుడి అరుణ్ శర్మ మాట్లాడుతూ, ఈ నెల 22న శనివారం పునఃప్రతిష్ఠాపన మహోత్సవాల్లో భాగంగా శాంతి పాఠం, గణపతి పూజ, స్వస్తి పుణ్యాహవాచనం, యాగశాల ప్రవేశం, కుంకుమార్చనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 23న ఆదివారం గణపతి పూజ, గర్భవాసం, బీజన్యాసం, మండపారాధన, మూలమంత్ర జపం అనంతరం కన్యా లగ్నంలో శ్రీ పోచమ్మ తల్లి విగ్రహ పునఃప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వివరించారు. పునఃప్రతిష్ఠాపన అనంతరం భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించవచ్చని తెలిపారు. అనంతరం మధ్యాహ్నం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మహోత్సవ వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని నిర్వాహకులు కోరారు.

# క్రీడలతో శారీరక దారుఢ్యం, క్రమశిక్షణ, జట్టు స్ఫూర్తి పెంపొందుతాయి

**టీమ్‌వర్క్‌తోనే విజయాలు.. లోపాలను గుర్తించి సరిదిద్దుకోవాలి**

**రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా**

**కాళేశ్వరం జోన్ పోలీస్ క్రీడా పోటీలను ప్రారంభించిన సీపీ**



మంచిర్యాల, ఆగస్టు 21 (ప్రజాజ్యోతి): క్రీడలతో శారీరక దారుఢ్యం, క్రమశిక్షణ, జట్టు స్ఫూర్తి పెంపొందుతాయని, టీమ్‌వర్క్‌తోనే విజయాలని, లోపాలను గుర్తించి సరిదిద్దుకోవాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా సూచించారు . 5వ తెలంగాణ రాష్ట్ర పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్--2026లో భాగంగా క్లస్టర్--ఒ కాళేశ్వరం జోన్ పోలీస్ క్రీడా పోటీలను రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా శుక్రవారం గోదావరిఖని ఆర్‌సీఓ క్లబ్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పోలీస్ సిబ్బందిలో శారీరక దారుఢ్యంతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, సమన్వయం, జట్టు స్ఫూర్తిని పెంపొందించడంలో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. పోలీస్ విధుల్లో శారీరక దారుఢ్యంతో పాటు క్రమశిక్షణ, సమన్వయం, జట్టు స్ఫూర్తి ఎంతో ముఖ్యమని సీపీ పేర్కొన్నారు. టీమ్‌వర్క్, పరస్పర సహకారం, నిరంతర సాధనతో పాటు తమలోని లోపాలను గుర్తించి సరిదిద్దుకోవడం ద్వారా విజయాలు సాధించవచ్చని సూచించారు. ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది క్రీడాస్ఫూర్తిని అలవర్చుకుని పరస్పర విశ్వాసంతో సమిష్టిగా పనిచేయాలని ఆకాంక్షించారు. క్రీడలు పోలీస్ సిబ్బందిలో శారీరక దారుఢ్యం, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, సమన్వయం, జట్టు భావనను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని సీపీ తెలిపారు. క్రీడల్లో పాల్గొనే పోలీస్ అధికారులు, సిబ్బందికి పోలీస్ శాఖ తరపున పూర్తి సహకారం, అవసరమైన మద్దతు అందిస్తామని భరోసా ఇచ్చారు. ఈ పోటీల్లో షటిల్ బ్యాడ్మింటన్, లాన్ టెన్నిస్, టేబుల్ టెన్నిస్ క్రీడల్లో ఓపెన్ కేటగిరీతో పాటు 18--30, 40ం, 50ం వయస్సు విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నారు. కాళేశ్వరం జోన్ పరిధిలోని రామగుండం పోలీస్ కమిషనరేట్, కొమురంభీమ్ ఆసిఫాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాలకు చెందిన పోలీస్ క్రీడాకారులు పోటీల్లో పాల్గొంటున్నారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచి విజయం సాధించే క్రీడాకారులు వచ్చే నెల 7, 8, 9 తేదీల్లో హైదరాబాద్‌లోని తెలంగాణ పోలీస్ అకాడమీలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో కాళేశ్వరం జోన్ తరపున ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ--అడ్మిన్ కె.శ్రీనివాస్, గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, ఆర్ఐలు దామోదర్, పెద్దన్న, రమేష్, మల్లేశం, ఆర్ఎస్ఐలు వెంకట్, శివ తదితరులు పాల్గొన్నారు.

# బీసీ రాజకీయ ప్రాతినిధ్యంపై విస్తృత చర్చ జరగాలి

**రాజకీయ అవకాశాల్లో బీసీలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించాలి**

**బహుజనుల రాజ్యాధికార సాధనకు యువత ముందుకు రావాలి**

**తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా నాయకులు మహేష్ వర్మ**



మంచిర్యాల, ఆగస్టు 21 (ప్రజాజ్యోతి): మంచిర్యాల నియోజకవర్గం లో నెలకొంటున్న రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా బీసీ నాయకత్వం ఆలోచించాల్సిన అవసరం ఉందని తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా నాయకులు మహేష్ వర్మ అన్నారు. తన కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య సమావేశంలో రాజకీయ పార్టీల్లో సామాజికవర్గాల ప్రాతినిధ్యంపై విస్తృతమైన చర్చ జరగాల్సిన అవసరం ఉందని తెలిపారు . ఈ సందర్భంగా మహేష్ వర్మ మాట్లాడుతూ, మంచిర్యాల నియోజకవర్గంలో బీసీ సామాజికవర్గం గణనీయమైన జనాభాను కలిగి ఉన్నప్పటికీ, రాజకీయ నిర్ణయ ప్రక్రియలో, నాయకత్వ అవకాశాల్లో బీసీలకు తగిన స్థాయిలో ప్రాతినిధ్యం లభిస్తుందా అనే అంశంపై అన్ని రాజకీయ పార్టీలు ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. బీసీలను కేవలం ఎన్నికల సమయంలో ఓట్లు వేసే వర్గంగా మాత్రమే చూడటం సరికాదని అన్నారు. బీసీ సామాజికవర్గానికి నాయకత్వం వహించే సామర్థ్యం, ప్రజా సమస్యలపై పోరాడే శక్తి ఉందని మహేష్ వర్మ స్పష్టం చేశారు. అన్ని రాజకీయ పార్టీలు బీసీ నాయకులను ప్రోత్సహించి, వారు రాజకీయంగా ఎదిగేందుకు తగిన అవకాశాలు కల్పించాలని కోరారు. ప్రజాస్వామ్యంలో ప్రతి సామాజికవర్గానికి సముచిత రాజకీయ భాగస్వామ్యం ఉండాలని అన్నారు. బహుజన యువత రాజకీయాల్లోకి వచ్చి ప్రజా సమస్యలపై చురుకుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. మంచిర్యాల నియోజకవర్గంలో బీసీ నాయకత్వాన్ని బలోపేతం చేసేందుకు తెలంగాణ రాజ్యాధికార పార్టీ కృషి చేస్తుందని తెలిపారు. ప్రజా సంఘాలు, బీసీ నాయకులు, మేధావులు ఈ అంశంపై నిర్మాణాత్మకంగా చర్చించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. జనాభాకు అనుగుణంగా సామాజిక న్యాయం, రాజకీయ ప్రాతినిధ్యం, నాయకత్వ అవకాశాలపై విస్తృత చర్చ జరగాలని, బీసీ సమాజం తమ హక్కులు, అవకాశాలు, రాజకీయ భాగస్వామ్యంపై చైతన్యంతో ముందుకు సాగాలని మహేష్ వర్మ అన్నారు. త్వరలోనే బీసీ సంఘాల నాయకులు, బీసీ మేధావులతో సమావేశం ఏర్పాటు చేసి మంచిర్యాల నియోజకవర్గంలో బహుజన రాజ్యాధికార సాధనలో బీసీ నాయకత్వం పాత్రపై చర్చిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా నాయకులు పాకాల దినకర్, పాడాల శివతేజ పాల్గొన్నారు.

## స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



**ఆసిఫాబాద్ఆగస్టు 21 ప్రజా జ్యోతి** ఆసిఫాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డు ఉస్మానియా మసీదులో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. రెవెన్యూ శాఖ సిబ్బందితో కలిసి ఆసిఫాబాద్ మున్సిపాలిటీ ఫ్లోర్ లీడర్ అబ్దుల్లా భాయ్ లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అబ్దుల్లా భాయ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తున్నారని తెలిపారు. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా లబ్ధిదారులకు మరింత మెరుగైన సేవలు అందే అవకాశం ఉందన్నారు. అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ శాఖ సిబ్బంది, డీసీసీ ఉపాధ్యక్షుడు తారీక్, సఫన్, షఫీ, నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## సిర్పూర్(టి) చుట్టు పక్కల గ్రామాల్లో వైట్ కార్డుదారుల నుండి 63 బస్తాలు 30 క్వింటల్లా పిడిఎస్ రాయితీ బియ్యాన్ని పట్టుకున్న

**జిల్లా పౌరసరఫరాల అధికారి వాజిద్ అలీ, ఎన్ఫోర్స్మెంట్ డిటి రాజ్ కుమార్, సిర్పూర్ (టి) గిర్ధవర్ సంయుక్తం గా తనిఖీ చేసి**

**సిర్పూర్(టి) చుట్టు పక్కల గ్రామాల్లో 30 క్వింటల్ లు (63 బస్తాల) పిడిఎస్ రాయితీ బియ్యం పట్టివేత,వాహనం సీజ్**



**ఆగస్ట్ 21,సిర్పూర్ (టి) కానిస్టెన్సీ కరస్పాండెంట్ ప్రజా జ్యోతి:** కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి)మండల కేంద్రంలోని చుట్టుపక్కల గ్రామాల్లో పిడిఎస్ రాయితీ బియ్యం అక్రమ రవాణా జరుగుతుందని అందిన పక్క సమాచారం మేరకు గురువారం జిల్లా అధికారి వాజిద్ అలీ, ఇన్ఫోర్స్మెంట్ డిటి రాజ్ కుమార్, సిర్పూర్ (టి)గిర్ధవర్ సంయుక్తం గా తనిఖీలు నిర్వహించగా సిర్పూర్ (టి) మండలలోని వివిధ గ్రామాల్లో తెల్ల రేషన్ కార్డు లబ్ధిదారుల నుండి కొనుగోలు చేసిన 63 బస్తాల సుమారు 30 కింటల్లా పిడిఎస్ రాయితీ బియ్యాన్ని పట్టుకున్నామని అధికారులు తెలిపారు. బియ్యంతో పాటు పిక్ అప్ టిజి 20 టి 2185 వాహనాన్ని జప్తు చేశామని అన్నారు. అనంతరం జిల్లా సరఫరాల అధికారి వాజిద్ అలీ, ఇన్ఫోర్స్మెంట్ రాజ్ కుమార్ తెలిపిన ప్రాథమిక వివరాల ప్రకారం మండల కేంద్రంలోని మారు మూల గ్రామాల్లో పిడిఫ్ బియ్యం అక్రమ రవాణా జరుగుతుందని అందిన పక్క సమాచారం మేరకు సంయుక్తంగా తనిఖీలు చేపట్టామని ఈ తనిఖీ లో భాగంగా వైట్ రేషన్ కార్డ్ దారుల నుండి తక్కువ ధరలకు కొనుగోలు చేసి అధిక లాభం ధ్యేయంగా టీజీ 20టి 2185 మహేంద్ర పికప్ వాహనం ద్వారా మహారాష్ట్రకు తరలించడానికి ప్రయత్నిస్తుండగా సిర్పూర్ (టి)కు చెందిన సురేష్ టేకేదార్ ను పట్టుకోవడం జరిగిందని అన్నారు. బియ్యం తరలిస్తున్న మహేంద్ర వాహనాన్ని జప్తు చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఇన్ఫోర్స్మెంట్ డిటి రాజ్ కుమార్ తెలిపారు అంతం అధికారులు మాట్లాడుతూ. ప్రభుత్వం ద్వారా ఉచితంగా అందించబడుతున్న పిడిఎస్ బియ్యాన్ని దుర్వినియోగం చేసినట్లయితే కఠిన చట్టరీత్యా చర్యలు చేపట్టడం జరుగుతుందని అన్నారు.

# రెండో దశ ఎస్ఐఆర్‌లో కార్యకర్తలు కీలకంగా పని చేయాలి

## బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర గౌడ్

**మంచిర్యాల, ఆగస్టు 21 (ప్రజాజ్యోతి):** మంచిర్యాల జిల్లా చెన్నూరు నియోజకవర్గంలో దాదాపు 30 వేల మంది ఓటర్లకు రెండో దశ ఎస్ఐఆర్‌లో నోటీసులు అందనున్న నేపథ్యంలో, నోటీసులు అందుకున్న ప్రతి ఒక్కరికి అండగా నిలిచి, వారు సరైన సమాధానం సమర్పించేలా భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర గౌడ్ అన్నారు. కిష్టంపేట గ్రామంలోని బీఎంఆర్ గార్డెన్‌లో నిర్వహించిన రెండో దశ ఎస్ఐఆర్ వర్క్‌షాప్‌లో రాష్ట్ర ఎస్ఐఆర్ కన్వీనర్ ఆంతోనీ రెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. కొత్త ఓటర్ల నమోదు కోసం ఫారం-6, ఓటు చిరునామా మార్పు కోసం ఫారం-8, అభ్యంతరాల నమోదుకు ఫారం-7 సమర్పించాల్సి ఉంటుందని కార్యకర్తలకు వివరించారు. రెండో దశ ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తయి తుది ఓటరు జాబితా విడుదలయ్యే వరకు బూత్ స్థాయి ఏజెంట్లు-2 (బీఎల్ఏ-2) నిరంతరం అప్రమత్తంగా ఉండాలని వెంకటేశ్వర గౌడ్ సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు హక్కు పరిరక్షించేలా క్షేత్రస్థాయిలో



సమన్వయంతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్ఐఆర్ కన్వీనర్ ఆంతోనీ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దుర్గం అశోక్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎనకందుల కృష్ణమూర్తి, బీఎల్ఏ-1 జాడి తిరుపతి, జిల్లా కార్యదర్శి వైద్య శ్రీధర్, మండల పార్టీ అధ్యక్షులు బుర్ర రాజశేఖర్ గౌడ్, బోర్‌కుట్టి శంకర్, ఠాకూర్ ధన్‌సింగ్, సప్పిడి నరేష్ తదితరులు పాల్గొన్నారు

# కోమటిగూడలో ఘనంగా నూతన బొలెరో వాహన పూజ

### వాహన పూజలో పాల్గొన్న మండల అధ్యక్షుడు గుర్నూలే మెంగజీ

**ఆసిఫాబాద్, ఆగస్టు 21 (ప్రజాజ్యోతి)** కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలంలోని కోమటిగూడ గ్రామంలో గుర్నూలే మనోహర్ నూతన బొలెరో వాహనానికి పూజా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వాంకిడి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుర్నూలే మెంగజీ ముఖ్యఅతిథిగా హాజరై కొబ్బరికాయ కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గుర్నూలే మెంగజీ నూతన వాహన యజమాని గుర్నూలే మనోహర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. నూతన వాహనం ద్వారా మంచి అభివృద్ధి, ఆర్థిక ప్రగతి సాధించాలని ఆకాంక్షించారు. ఈ



కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఉప సర్పంచ్ కొట్రంగ విజయ్ కుమార్, గ్రామ పటేల్ గుర్నూలే వాసుదేవ్, కోట్రంగ దేవరావు, సండే బాబురావు, కొట్రంగి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## సిర్పూర్ రేంజ్ పరిధి లోని హుడ్కుళ్ళి అటవీ ప్రాంతానికి సందర్శకుల తాకిడి పెరగడంతో అప్ర మత్తమైన అటవీశాఖ అధికారులు హెచ్చరిక బోర్డు ఏర్పాటు

**ఇటిక్యాల పహాడ్ లో అటవీ ప్రాంతంలో మేతకు వెళ్లిన బర్రె దూడపై దాడి చేసిన పెద్దపులి**

**మరణించిన బర్రె దూడ ను పంచనామ నిర్వహించి నష్టపరిహారానికి ఉన్నతాధికారులకు సిఫారసు నివేదిక అందజేత:బి**

**ప్రభుత్వం నుండి వచ్చిన నష్టపరిహారాన్ని యజమానికి అందిస్తాం:బిబి**

**అప్రమత్తమైన అటవీశాఖ అటవీ ప్రాంతానికి సందర్శకులు రాకుండా నిరంతరం ఒకరు కాపాల ఉండేలా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాం:బిబి**






**సిర్పూర్ (టి)ఎఫ్ఆర్ఓ శ్రీనివాస్:** ఆగస్టు21,సిర్పూర్ (టి) కానిస్టెన్సీ కరస్పాండెంట్ ప్రజాజ్యోతి: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి) మండలం ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని హుడ్కుళ్ళి అటవీ ప్రాంతానికి సందర్శకుల తాకిడి రోజురోజువు పెరిగిపోతుండడంతో అప్రమత్తమైన అడవి శాఖ అధికారులు గురువారం హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. పెద్దపులి సంచారం నేపథ్యంలో సందర్శకులను పలుమార్లు హెచ్చరించినా పట్టించుకోకపోవడంతో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసి నిరంతరం ఒకరు కాపలా ఉండేలా చర్యలు చేపట్టడం జరిగిందని అన్నారు. ఇదిలా ఉండగా చీలపల్లి గ్రామానికి చెందిన గొడ్ల మల్లు బర్రె దూడ ఇటుకలపహాడ్ అటవీ ప్రాంతానికి మేతకు వెళ్లగా బుధవారం రోజు పెద్దపులి దాడిలో మరణించింది. అటవీ శాఖ అధికారులు పంచనామా నిర్వహించి నష్టపరిహారానికై ఉన్నతాధికారులకు సిఫార్సు నివేదికను సమర్పించడం జరిగిందని ఎఫ్ఆర్ఓ శ్రీనివాస్ తెలిపారు.

## టి. నరేంద్రబాబు సేవలు చిరస్మరణీయం



**మంచిర్యాల, ఆగస్టు 21 (ప్రజాజ్యోతి):** కొత్తగూడెంలోని బీఎంఎస్ భవన్‌లో ఆగస్టు 20న సాయంత్రం ప్రియతమ మిత్రుడు, సహచరుడు టి. నరేంద్రబాబు సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించి, ఆయనతో తమకున్న ఆత్మీయ అనుబంధాన్ని, ఆయన అందించిన సేవలను, తమతో పంచుకున్న మధురమైన జ్ఞాపకాలను పలువురు స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఏబీకేఎంఎస్ కార్యదర్శి పి. మాధవ నాయక్, విభాగ్ కార్యవాహ చేపూరి రామచంద్రరావు, జిల్లా సంఘచాలక్ జీ. వెంకటరెడ్డి, యూనియన్ చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ టి.ఎస్. పవన్ కుమార్ తదితరులు మాట్లాడుతూ నరేంద్రబాబుతో తమకున్న అనుబంధాన్ని, ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఆయన స్నేహశీలత, ఆత్మీయత, సహచరుల పట్ల చూపిన ఆదరణ ఎప్పటికీ మరువలేనివని అన్నారు. నరేంద్రబాబు అకాల మరణం ఆయన కుటుంబ సభ్యులతో పాటు మిత్రులు, సహచరులు, సన్నిహితులకు తీరని లోటుగా మిగిలిందన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని కుటుంబ సభ్యులకు భగవంతుడు ప్రసాదించాలని ప్రార్థించారు. నరేంద్రబాబు అందించిన సేవలు, ఆయన ఆత్మీయత, స్నేహబంధం, మధురమైన జ్ఞాపకాలు చిరస్థాయిగా నిలిచిపోతాయని వక్తలు అన్నారు .

## తగినంత ఆహారం, నీరు,లేకుండా బొలెరో పికప్ వాహనంలో తరలిస్తున్న (3) ఆవులు,(4)దూడలు పోలీసుల తనిఖీలో పట్టివేత

**వాహనం స్వాధీనం చేసుకుని ఎరువుల కుమార్, గొంటి సత్యనారాయణ,శ్రీనివాస్ లను పోలీస్ స్టేషన్ తరలించి**

**ముగ్గురిపై కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నాం. సిర్పూర్ (టి) ఎస్ఐ,డి. సాగర్:బిబి**

**ఆగస్టు 21, సిర్పూర్(టి) కానిస్టెన్సీ కరస్పాండెంట్ ప్రజాజ్యోతి:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ (టి) మండల కేంద్రంలో హెచ్.పి పెట్రోల్ బంక్ వద్ద గురువారం పోలీసులు తనిఖీ చేస్తున్న సందర్భంలో అనుమానాస్పదంగా వెళ్తున్న టీఎస్02.యుడి 3433 మహేంద్ర బొలెరో పికప్ వాహనాన్ని ఆపి తనిఖీ చేస్తున్న క్రమంలో పోలీసులకు పట్టి వాహనంలో తగినంత నీరు ఆహారం లేక(3) ఆవులు(4) ఆవు దూడలను కిక్కిరిసిన విధంగా అక్రమంగా తరలిస్తున్న విషయాన్ని నిర్ధారించిన పోలీసులు విచారణలో భాగంగా నిందితులు, ఏవన్ ఎరుగురాల కుమార్, ఎటు2 ,గొంటి సత్యనారాయణ,ఏ 3 అగుర్ల శ్రీనివాస్ లను అదుపులో తీసుకొని విచారించగా లోనవెల్లి గ్రామస్థుల నుండి ఆవులు, దూడలను కొనుగోలు చేసి, అధిక ధరకు విక్రయించేందుకు కరీంనగర్‌కు తరలిస్తున్నట్లు వెల్లడైందని పోలీసు తెలిపారు.ఈ సందర్భంగా నిందితుల నుండి మహీంద్రా బొలెరో పికప్ వాహనం, (03) ఆవులు అదేవిధం గా (04)ఆవు దూడలను స్వాధీనం చేసుకున్నా మని ఎస్సై డి సాగర్ తెలిపారు.ముగ్గురు నిందితులను పోలీస్ స్టేషన్‌కు తరలించి, వారిపై చట్ట ప్రకారం కేసు నమోదు చేసి తదుపరి చర్యలు చేపట్టారు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై డి.సాగర్ తెలిపారు..

## బీఆర్ఎస్ కార్యకర్తల చేరిక ప్రచారం అవాస్తవం



**ఆసిఫాబాద్ ఆగష్టు 21 ప్రజా జ్యోతి** కొమురంభీం ఆసిఫాబాద్ వాంకిడి గోయగావ్ గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలుగా కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు నిన్న ప్రచారం కావడాన్ని వాంకిడి మండల బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు, మాజీ జడ్పీటీసీ డా. పర్వల్లి అజయ్‌కుమార్ తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు ప్రచారం అవుతున్న వ్యక్తులు బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు కాదని ఆయన స్పష్టం చేశారు. వారికి బీఆర్ఎస్ పార్టీతో ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. రాజకీయంగా లబ్ధి పొందేందుకె కాంగ్రెస్ వాస్తవాలను వక్రీకరించి, వారు బీఆర్ఎస్ కార్యకర్తలుగా ప్రచారం చేయడం పూర్తిగా అవాస్తవమని పేర్కొన్నారు. గోయగావ్ గ్రామానికి చెందిన వ్యక్తుల విషయంలో బీఆర్ఎస్ పార్టీకి ఎలాంటి సంబంధం లేదని, ఈ విషయాన్ని పార్టీ తరఫున స్పష్టంగా తెలియజేస్తున్నామని అజయ్‌కుమార్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిని బీఆర్ఎస్ కార్యకర్తలుగా పేర్కొంటూ వచ్చిన ప్రచారాన్ని పూర్తిగా ఖండిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు.

## రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తిని మర్యాదపూర్వకంగా కలిసిన కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల, ఆగస్టు 21 (ప్రజాజ్యోతి):** జిల్లాలోని మందమర్రి, బెల్లంపల్లి పట్టణాల్లో నేడు (ఈ నెల 22న) కోర్టు భవనాల ప్రారంభోత్సవ కార్యక్రమాలు జరగనున్న నేపథ్యంలో శుక్రవారం జిల్లాకు విచ్చేసిన రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా పరిపాలన న్యాయమూర్తి నగేష్ భీమపాకను జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మర్యాదపూర్వకంగా కలిశారు. జైపూర్‌లోని ఎస్‌టీపీపీ అతిథి గృహంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.వీరయ్య సమక్షంలో న్యాయమూర్తి నగేష్ భీమపాకను కలెక్టర్ కుమార్ దీపక్ కలిసి మొక్కను అందజేసి స్వాగతం పలికారు. కోర్టు భవనాల ప్రారంభోత్సవ కార్యక్రమాల ఏర్పాట్లపై ఈ సందర్భంగా చర్చించినట్లు తెలిపారు.

## త్వరలో క్యాతనపల్లి ప్రెస్ క్లబ్ నూతన కమిటీ



**రామకృష్ణాపూర్, ఆగస్టు 21 (ప్రజా జ్యోతి):** క్యాతనపల్లి ప్రెస్ క్లబ్ పాత కమిటీని రద్దు చేసి, త్వరలోనే నూతన కమిటీని ఎన్నుకోనున్నట్లు అధ్యక్షులు కలవల శంకర్, కోఆర్డినేటర్ దుస్సా శివప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఠాగూర్ స్టేడియంలో జరిగిన సమావేశంలో ప్రెస్ క్లబ్ అభివృద్ధి, జర్నలిస్టుల సంక్షేమంపై చర్చించారు. సమావేశంలో కనుకుంట్ల సుభాష్, రామిళ్ల శ్రీనివాస్, పరికిపండ్ల రాజు, పోలు దాసరి శ్రీనివాస్,తూముల భవిష్యత్, మామిడాల రవీందర్, మెరుగు నారాయణ, కరెడ్ల రఘు, ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రూ.2 కోట్ల మోసం ఆరోపణలు.. ఎస్పీని ఆశ్రయించిన బాధితులు



**ఆసిఫాబాద్, ఆగస్టు 21 ప్రజాజ్యోతి** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో రూ.2 కోట్లకు పైగా ఆర్థిక మోసం జరిగిందంటూ పలువురు బాధితులు శుక్రవారం జిల్లా ఎస్పీ నితికా పంత్‌ను ఆశ్రయించారు. ఆసిఫాబాద్‌కు చెందిన షేక్ ఖలీల్ అహ్మద్‌కు వివిధ సందర్భాల్లో 40--50 మంది డబ్బులు ఇచ్చినట్లు బాధితులు ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతో తాము తీవ్రంగా నష్టపోయామని వారు వాపోయారు. తమకు న్యాయం చేయడంతో పాటు వ్యవహారంపై సమగ్ర విచారణ చేపట్టి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎస్పీని కోరారు.

## కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాంలో భాగంగా ఎస్ఐ,ఎం.అనిల్ కుమార్ ఆధ్వర్యంలో తనిఖీలు

**పెంచికల్పేట్ మండలం చేడువాయి లో గుడుంబా స్థావరం పై పోలీసుల దాడులు**

**10 లీటర్ల నిషేధిత గుడుంబా స్వాధీనం,**

**3,000 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం:**

**నిషేధిత గుడుంబా తయారీ,నిలువ, రవాణా,విక్రయాలకు పాల్పడే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటాం,హెచ్చరిక:**

**ఘటనకు సంబంధించి ఒకరిపై కేసు నమోదు ఎస్సై,ఎం.అనిల్ కుమార్:**




**ఆగస్టు21,సిర్పూర్(టి) కానిస్టెన్సీ కరస్పాండెంట్ ప్రజాజ్యోతి:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి)నియోజక వర్గంలోని పెంచికల్పేట్ మండలం చేటుబాయి లో ఎస్ఐ,ఎం.అనిల్ కుమార్ ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. గ్రామంలో తనిఖీలు చేపట్టారు.తనిఖీలో భాగంగా గుడుంబా స్థావరంపై పోలీసులు దాడులు చేశారు.10 లీటర్ల నిషేధిత గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు.దాంతో పాటు 3,000 వేల లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. ఘటనకు సంబంధించి ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ,ఎం. అనిల్ కుమార్ తెలిపారు.ఈ సందర్భంగా ఎస్ఐ అనిల్ కుమార్ మాట్లాడుతూ.. నిషేధిత గుడుంబా తయారీ, నిల్వ, రవాణా, విక్రయాలకు పాల్పడే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో ఇలాంటి అక్రమ కార్యకలాపాలు జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం అందించి సహకరించాలని ప్రజలను కోరారు. ఈ తనిఖీల్లో హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణ్‌తో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# జిల్లా కలెక్టర్ భవిష్ మిశ్రా చేతుల మీదుగా ఆర్థిక అక్షరాస్యత కేంద్రం వాల్ పోస్టర్లను ఆవిష్కరించిన ఎల్డిఎం రామ్ గోపాల్

**ఆగస్ట్21,సిర్పూర్(టి) కానిస్టేన్సీ కరస్పాండెంట్ ప్రజాజ్యోతి:** నిర్మల్ జిల్లా కేంద్రం కలెక్టర్ కార్యాలయం నందు గురువారం ఆర్థిక అక్షరాస్యత కేంద్రాల వాల్ పోస్టర్లను జిల్లా కలెక్టర్ భవిష్ మిశ్రా, ఎల్డిఎం రాంగోపాల్ లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామస్థాయిలో బ్యాంకు సేవలు, ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ పేమెంట్స్, సైబర్ మోసాలపై మరింత విస్తృతంగా అవగాహన చేపట్టాలని అన్నారు. గ్రామస్థాయిలో నిరంతరం సిఎఫ్ఎల్ కౌన్సిలర్స్ ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని అన్నారు. సిఎఫ్ఎల్ ద్వారా అందించే సేవలను గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్థిక అక్షరాస్యత కేంద్రాల కౌన్సిలర్స్, తదితరులు పాల్గొన్నారు.



# ప్రతి పేదవాడికి సొంతిల్లు కల్పించడమే లక్ష్యం

## గుర్నాలే నారాయణ

### వాంకిడిలో ఇందిరమ్మ ఇంటి స్లాబ్ పనులకు పూజ

**ఆసిఫాబాద్ ఆగష్టు 21 ప్రజా జ్యోతి** ప్రభుత్వం పేద ప్రజల కష్టాలను గుర్తించి ప్రతి నిరుపేద కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా పనిచేస్తుందని కాంగ్రెస్ పార్టీ వాంకిడి మండల మాజీ అధ్యక్షులు గుర్నాలే నారాయణ అన్నారు. వాంకిడి మండల కేంద్రానికి చెందిన ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారు శిల్ప వెంకటేష్ ఇంటి స్లాబ్ పనులకు ఆయన ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించారు. పూజ అనంతరం పనులు ప్రారంభం వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య పూజలు నిర్వహించి స్లాబ్ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, కాంగ్రెస్ నాయకులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఇందిరమ్మ ఇళ్లే ప్రజా ప్రభుత్వానికి నిదర్శనం ఈ సందర్భంగా గుర్నాలే నారాయణ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ఇల్లు లేని పేదలకు న్యాయం జరుగుతుందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు అర్హులందరికీ దశలవారీగా ఇళ్లు మంజూరు చేసి సొంతింటి కలను నెరవేరుస్తుందని చెప్పారు. పేద ప్రజల కష్టసుఖాలను తెలుసుకుని వారికి అండగా నిలబడడమే కాంగ్రెస్ పార్టీ విధానమని అన్నారు.



# డబ్బా గ్రామ పంచాయతీ పరిధి లోని ప్రభుత్వ స్థలం కబ్జాలపై అధికారులను నిలదీత

మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం లో అధికారులపై ఫైర్ అయినా సర్పంచ్ సంతోష్

కబ్జా భూముల్ని ఇరిగేషన్ మరియు రెవెన్యూ అధికారులు స్వాధీనం చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆవేదన:బిబి

కబ్జా భూములపై ఎన్నిసార్లు అధికారులకు వినతిపత్రం సమర్పించిన నిమ్మకు నీరెత్తినట్టు వివాహరిస్తు పట్టించుకున్న పాపాన

పోలేదని వాపోయారు: మీకు చేతకాకుంటే చెప్పండి మేము తీసి చూపిస్తాం అని అధికారులను ప్రశ్నించిన సర్పంచ్ సంతోష్:

**ఆగస్టు 21,సిర్పూర్ (టి) కానిస్టెన్సీ కరస్పాండెంట్ ప్రజాజ్యోతి:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ (టి) నియోజక వర్గంలోని చింతల మానేపల్లి మండలం రైతు వేదిక బాలాజీ అనుకోడలో మండల ప్రజా పరిషత్ సమావేశంలో అధికారుల నిర్లక్ష్యంపై సర్పంచ్ డోంగ్రి సంతోష్ అధికారులపై ఫైర్ అయ్యారు.అనంతరం వారు సమావేశంలో సిర్పూర్ (టి)ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ రావు ఎంపీడీఓ,వివిధ శాఖల అధికారుల ముందు మాట్లాడుతూ...డబ్బా గ్రామ పంచాయతీ పరిధిలో ప్రభుత్వం స్థలం కబ్జాల పై సంబంధిత అధికారులను సర్పంచ్ సంతోష్ ప్రశ్నించారు.డబ్బా గ్రామంలో ఉన్న కబ్జా భూముల్ని ఇరిగేషన్ అదేవిధంగా రెవిన్యూ అధికారులు కబ్జా భూములను స్వాధీనం చేసి గ్రామ పంచాయతీ అభివృద్ధి కి సహకరించకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు డబ్బా గ్రామంలో ప్రభుత్వ భూములు కబ్జాలకు గురి అవుతున్నాయని ఎన్ని సార్లు అధికారులకు వినతి పత్రాలు అందించిన సంబంధిత అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తు పట్టించుకున్న పాపాన పోలేదని వాపోయారు మీకు చేత కాకుంటే చెప్పండి మేము తీసి చూపిస్తాం అని అధికారులను సర్పంచ్ సంతోష్ నిలదీశారు.





# శ్రీరాంపూర్ డివిజన్ సమస్యల పరిష్కారానికి హామీ



**మంచిర్యాల, 21,ఆగస్టు (ప్రజాజ్యోతి):** మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ డివిజన్‌లో నెలకొన్న వివిధ సమస్యల పరిష్కారం కోసం హైదరాబాద్‌లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో మంత్రి వివేక్, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణలను కలిసి సమస్యలను వివరించినట్లు మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ 6వ డివిజన్ కార్పొరేటర్, అధ్యక్షులు వనపర్తి కేత రాజేష్ తెలిపారు. జగన్మోహన్ రావు ఆధ్వర్యంలో మంత్రి వివేక్, ఎంపీ వంశీకృష్ణలను కలిసి శ్రీరాంపూర్ డివిజన్‌లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించినట్లు తెలిపారు. ప్రజా సమస్యలపై మంత్రి, ఎంపీ సానుకూలంగా స్పందించి, ప్రతి సమస్యను పరిష్కరించే విధంగా సంబంధిత అధికారులతో చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు. అంతేకాకుండా త్వరలో శ్రీరాంపూర్ డివిజన్‌లోని ప్రతి ప్రాంతంలో పర్యటించి ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని వారు హామీ ఇచ్చినట్లు కేత రాజేష్ వివరించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి మంత్రి, ఎంపీ స్పందించినందుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# మావల మండల కేంద్రంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

ముఖ్య అతిథిగా హాజరై పంపిణీ చేసిన మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి



**మావల, ఆగష్టు 21, (ప్రజా జ్యోతి )** తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేప ట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పం పిణీ కార్యక్రమాన్ని మావల మండల కేంద్రంలో నేడు ఆ దిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ కా ర్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని లబ్ధిదారులకు నూతన స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి సార ధ్యంలో తెలంగాణ ప్రజా ప్ర భుత్వం అర్హులైన పేదలందరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలా లు పారదర్శకంగా, ఎలాంటి ఆలస్యం లేకుండా అందాల నే ఉద్దేశంతోనే కాంగ్రెస్ ప్రభు త్వం ఈ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రతి ష్టాత్మకంగా అమలు చేస్తోందని స్పష్టం చేశారు. ఉచితంగా సన్నబియ్యం పంపిణీ చే స్తూ పేదల సంక్షేమమే ధ్యే యంగా పనిచేస్తోందని తెలి పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ముత్యంరావు, ఎంపీవో నందిని, మావల సర్పంచ్ ధర్మపురి చంద్రశేఖర్, ఉప సర్పంచ్ స్వప్న, అడేల్లు, వార్డు సభ్యులు, కంట్రోల్ డీలర్ సుధీర్ తదిత రులు పాల్గొన్నారు.

# ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం అన్ని సంఘాలు ఐక్యంగా కృషి చేయాలి

**తెలంగాణ గెజిటెడ్ అధికారుల జేఏసీ నాయకులు**

**రెండో పీఆర్సీ అమలు చేయాలి**

**-- ఆరు విడతల డీఏలు విడుదల చేయాలి**

**ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి టీజీఈజేఏసీ సమావేశం**



**మంచిర్యాల, ఆగస్టు 21 (ప్రజాజ్యోతి):** ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంతో పాటు పెండింగ్‌లో ఉన్న ఆర్థిక ప్రయోజనాలను వెంటనే అందించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ గెజిటెడ్ అధికారుల జేఏసీ ఆధ్వర్యంలో మంచిర్యాల జిల్లా సమావేశంను శుక్రవారం నిర్వహించారు. మంచిర్యాలలోని టీఎన్జీఓ మీటింగ్ హాల్‌లో టీజీఈజేఏసీ చైర్మన్ గడియారం శ్రీహరి ఆధ్వర్యంలో అన్ని ఉద్యోగ సంఘాలు, అసోసియేషన్లు, వివిధ శాఖల ప్రతినిధులతో విస్తృత సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఉద్యోగులు, పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలు, పెండింగ్‌లో ఉన్న ఆర్థిక ప్రయోజనాలు, ప్రభుత్వం పరిష్కరించాల్సిన ప్రధాన డిమాండ్లపై సుదీర్ఘంగా చర్చించారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం అన్ని సంఘాలు ఐక్యంగా కృషి చేయాలని సమావేశం నిర్ణయించింది. ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలను సానుకూలంగా పరిగణించి, చర్చల ద్వారా తక్షణ పరిష్కారం చూపాలని ప్రతినిధులు కోరారు. ఈ సమావేశంలో ప్రధానంగా రెండో వేతన సవరణ సంఘం పీఆర్సీని తక్షణమే అమలు చేయాలని, ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న ఆరు విడతల కరువు భత్యం డీఏలను వెంటనే విడుదల చేయాలని, ఉద్యోగులు, పెన్షనర్లకు సంబంధించిన ఉద్యోగుల ఆరోగ్య పథకం ఈహెచ్ఎస్‌ను సమర్థవంతంగా, తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే పెండింగ్‌లో ఉన్న అన్ని బిల్లులను పరిష్కరించేందుకు ప్రతి నెల రూ.2,000 కోట్లను విడుదల చేసి ఉద్యోగుల బకాయిలను త్వరితగతిన చెల్లించాలని, ఉద్యోగుల కాంట్రిబ్యూటరీ పెన్షన్ పథకం సీపీఎస్ సమస్యను పరిష్కరించి న్యాయం చేయాలని కోరారు. రాష్ట్రంలోని ఉద్యోగ సంఘాలు, అసోసియేషన్లకు తగిన గుర్తింపు కల్పించి, వాటి సమస్యలను అధికారికంగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉద్యోగుల ఆర్థిక, సామాజిక, సేవా ప్రయోజనాలకు సంబంధించిన ఈ కీలక సమస్యలను ప్రభుత్వం ఇకపై ఆలస్యం చేయకుండా పరిష్కరించాలని సమావేశం అభిప్రాయపడింది. సమస్యల పరిష్కారం కోసం అవసరమైన తదుపరి కార్యాచరణను అన్ని ఉద్యోగ సంఘాల నాయకులతో సమన్వయం చేసుకుని చేపట్టాలని నిర్ణయించారు. సమావేశంలో టీజీఈజేఏసీ మంచిర్యాల జిల్లా సెక్రటరీ జనరల్ వనజా రెడ్డి, రాష్ట్ర వైస్ చైర్మన్ పర్వతి సత్యనారాయణ, మంచిర్యాల జేఏసీ కో-చైర్మన్లు శ్రీనివాస్‌రావు దేశ్‌పాండే, బట్టరీ వెంకటేశ్వర్, సుమిత్, పుప్పాల హనుమంతరావు, శ్రీపతి బాపురావు, పొన్న మల్లయ్య, దుర్గా ప్రసాద్, భూముల రామ్మోహన్, బొడ్డు శ్రావణ్ కుమార్, సుధాకర్, పత్తి సత్తయ్య, డిప్యూటీ చైర్మన్లు సూరినేని గంగాధర్, బి. రవీందర్, ఎస్. కిషన్, ఏ. సునీత, నాగుల గోపాల్, పబ్లిసిటీ సెక్రటరీ రాంకుమార్, సెక్రటరీలు సత్యనారాయణ, తిరుపతి, రాంకుమార్, వెంకటేష్, సీపీఎస్ యూనియన్ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు ఏ. రాజేందర్, టీఎన్జీఓ నాయకులు, వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల, కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# భారత మాజీ ప్రధాని భారతరత్న స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతి ని పురస్కరించుకొని

కాగజ్ నగర్ పట్టణంలోని రాజీవ్ గాంధీ విగ్రహానికి

పూలమాల వేసి ఘన నివాళులు అర్పించి

అంబేద్కర్ చౌక్ లో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి

పూలమాల వేసి నివాళులు అర్పించి శ్రమదానం:

మార్కెట్లో ప్రజలకు సీట్లు పంచిన అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిని

సందర్శించి పేషెంట్లకు పండ్లు పంపిణీ చేసిన:

ఆల్ ఇండియా మహిళా కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి బి. అధిత:




**ఆగస్టు21,సిర్పూర్(టి) కానిస్టెన్సీ కరస్పాండెంట్ ప్రజాజ్యోతి:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి)నియోజక వర్గంలోని సిర్పూర్ కాగజ్నగర్ మండలంలో భారత మాజీ ప్రధాని భారతరత్న స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతిని పురస్కరించుకొని అట్టి సందర్భం లో ఆల్ ఇండియా మహిళా కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి బి.అధిత ఆధ్వర్యంలో గురువారం రాజీవ్ గాంధీ చౌక్ లో రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మార్కెట్ ప్రాంతంలో ప్రజలకు సీట్లు పంపిణీ చేసి రాజీవ్ గాంధీ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం ప్రభుత్వ ఆసుపత్రి ని సందర్శించిన ఆల్ ఇండియా మహిళా కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి బి. అధిత పేషెంట్లకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం అంబేద్కర్ చౌక్ లో బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించి అక్కడ శ్రమదానం చేపట్టారు. ఈ సందర్భంగా ఆల్ ఇండియా మహిళా కాంగ్రెస్ జాతీయ నాయకు రాలు బి.అధిత మాట్లాడుతూ. 18 ఏళ్లకు ఓటు హక్కు కల్పించిన ఆధునిక భారత నిర్మాణానికి బాటలు వేసిన గొప్ప వ్యక్తి భారతరత్న అవార్డు గ్రహీత మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ అని కొనియా డారు. అంతేకాకుండా టెలికాం రంగా అభివృద్ధి విద్య వ్యవస్థను బలోపేతం చేసి సాంకేతిక విప్లవానికి శ్రీకారం చుట్టిన ఘనత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీకి దక్కిందని అన్నారు. స్థానిక సుపరిపాలన వ్యవస్థలు మహిళలకు ముప్పై మూడు శాతం రిజర్వేషన్ కల్పించేందుకు ఎంతో కృషి చేశారని అన్నారు. ఓటు హక్కు వయస్సు 21 ఏళ్ల నుంచి 18 ఏళ్లకు తగ్గించి యువతకు ఎన్నికల ఓటు హక్కు కల్పించారని అన్నారు. యువతకు ప్రజా స్వామ్యంలో భాగస్వామ్యం కల్పించాలనే ఉద్దేశంతో 18 సంవత్సరాలు నిండిన వారికి ఓటు హక్కు కల్పించేలా రాజీవ్ గాంధీ తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మక మని అన్నారు.యువతే దేశ భవిష్యత్తు అని నమ్మిన ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా ప్రారంభమైన ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా 18 సంవత్సరాలు నిండిన యువత ఓటరుగా నమోదు చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకు రాలు బి. అధిత సూచించారు. ఈ సందర్భంగా అర్హులైన యువతకు ఫారం--6 దరఖాస్తులను అందజేశారు.ప్రజాస్వామ్యం లో ఓటు హక్కు అత్యంత కీలకమైనదని, 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. బూత్ స్థాయి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తమ పరిధిలోని యువతకు ఓటు హక్కుపై అవగాహన కల్పించి, అర్హులైన ప్రతి ఒక్కరి ఫారం--6 దరఖాస్తు ప్రక్రియలో చురుకుగా పాల్గొనాలని ఆల్ ఇండియా మహిళా కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి బి, అధిత పిలుపునిచ్చారు.

## రెబ్బెన మండలం సోనాపూర్ వద్ద ఆవులను ఢీకొన్న బొగ్గు లారీ

**2 ఆవులు మృతి చెందగా తీవ్ర గాయాలతో కాలు విరిగిన 4 ఆవులు**

**ఆగ్రహించిన గ్రామస్తులు ఇరువైపుల లారీలను నిలిపివేత:బి**



**ఆగస్ట్21సిర్పూర్(టి) కానిస్టెన్సీ కరస్పాండెంట్ ప్రజాజ్యోతి:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలం సోనాపూర్ గ్రామం వద్ద ఉన్న కైరిగూడ ఓసీ మైన్ వద్ద నుండి గోరేటి సిహెచ్చికి లారీలో బొగ్గును తీసుకొస్తున్న క్రమంలో సోనాపూర్ వద్ద ఆవులను ఢీకొట్టడంతో రెండు ఆవులు అక్కడిక్కడే మృతిచెంద గా తీవ్ర గాయాలతో నాలుగు ఆవుల కాలు విరగడం జరిగింది. దీంతో ఆగ్రహించిన గ్రామస్తులు ఆవేదనతో ఇరువైపులా లారీలను నిలిపివేశారు.

## అనారోగ్యంతో చికిత్స పొందుతున్న లింగమూర్తిని పరామర్శించిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్



**ఆగస్టు21,సిర్పూర్(టి) కానిస్టెన్సీ కరస్పాండెంట్ ప్రజా జ్యోతి:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి) నియోజక వర్గంలోని కౌటాల మండలం గురుడుపేట గ్రామానికి చెందిన కత్తెరసాల సత్యనారాయణ కుమారుడు లింగమూర్తి అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందు తున్న విషయం తెలుసుకున్న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ నిమ్స్ ఆసుపత్రికి వెళ్లి లింగమూర్తిని పరామర్శించారు. అనంతరం వైద్యులను కలిసి లింగమూర్తికి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.ఆయన ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకుని, అవసరమైన వైద్య సహాయం అందేలా చూడాలని కోరారు. లింగమూర్తి త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని ఎమ్మెల్సీ దండే విఠల్ ఆకాంక్షించారు.

## శిశు మందిర్ లో వైభవంగా సామూహిక వరలక్ష్మీ వ్రతాలు



**ఇచ్చోడ ఆగస్టు 21, (ప్రజా జ్యోతి)**ఇచ్చోడ మండల కేంద్రము లోని శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠ శాలలో సామూహిక వరలక్ష్మీ వ్రతం కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రభుత్వ ఉపాధ్యా యులు దేవర్ల సంతోష్ మాట్లాడుతూ సరస్వతీ విద్యా పీఠం ద్వారా నడుపుతున్న సరస్వతీ శిశు మందిర్ పాఠశాలల్లో ప్రతీ సంవత్సరం శ్రావణ రెండవ రోజు పాఠశాలలో నిర్వహించడం జరుగు తుందని, అలాగే మహిళలు సామూహికంగా పాల్గొని భ క్తి శ్రద్ధలతో వ్రతాన్ని ఆచరిస్తారు అని అన్నారు. ఈ కా ర్యక్రమంలో ఉషారాణి,శైలజ, మంజుల ఆధ్వర్యంలో వర లక్ష్మీ అమ్మవారి ప్రతిమకు పూజా కార్యక్రమం నిర్వహించి వ్రతకథను చదివి వచ్చిన మాతలచే హారు తులు ఇప్పించారు.వరలక్ష్మీ శ్లోకాలు చదివారు. ఈ కార్యకరమానికి ముఖ్య అతిథులుగా నారాయణ రెడ్డి, ప్రధానాచా ర్యులు మరాఠీ సంతోష్‌కు మార్, నాగమణి, శైల జా ఆచార్యులు భారతి, సుజాత, సిందుజ, శంకర్ పూర్వ వి ద్యార్థులు ప్రహ్లద్, నాగేందర్, సాయి దాదాపు 65 మంది మహిళలు విద్యార్థులు పాల్గొన్నారు.

## దేశ సంపద కొద్దిమంది కా ర్పొరేట్లకు కాదు,దేశ ప్రజలకే హక్కుగా దక్కాలి

ఏఐవైఎఫ్ రాష్ట్ర 3వ మహా సభల గోడ పత్రిక విడుదల

ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కా ర్యదర్శి కల్లూరు ధర్మేంద్ర




**ఆదిలాబాద్ బ్యూరో,ఆగస్టు 21,( ప్రజా జ్యోతి )** దేశ సంపద కొద్దిమంది కా ర్పొరేటర్లకు కాకుండా దేశ ప్ర జలకే హక్కుగా దక్కాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి క ల్లూరు ధర్మేంద్ర పేర్కొన్నారు. దేశాన్ని పాలించే ప్రభుత్వా ల ప్రధాన బాధ్యత ప్రజల జీ వన ప్రమాణాలను మెరుగు పరచడం, ప్రతి యువకుడికి ఉపాధి, ప్రతి విద్యార్థికి నా ణ్యమైన విద్య, ప్రతి కుటుం బానికి అందుబాటు వైద్యం, రైతుకు గిట్టుబాటు ధర, కా ర్మికుడికి గౌరవ ప్రదమైన జీ వనం, మహిళలకు భద్రత, ప్రజాస్వామ్య హక్కులకు రక్షణ కల్పించడమని అఖి ల భారత యువజన సమా ఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర , ప్ర ధాన కార్యదర్శి కల్లూరు ద ర్మేంద్ర అన్నారు.ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షు కార్యదర్శి మ డావి గంగోత్రి, మెస్రం భాస్కర్ ల ఆద్వర్యంలో యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరి గుట్ట లో సెప్టెంబర్ 8,9,10 తేదీల్లో జరగనున్న ఏఐ వై ఎఫ్ రాష్ట్ర 3వ మహాసభల గోడ పత్రికను శుక్రవారం యాదవ సంఘ భవన్ లో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్య దర్శి, కల్లూరు ధర్మేంద్ర జిల్లా అధ్యక్షు కార్య దర్శి మాడవి గంగోత్రి మెస్రం భాస్కర్‌లు మాట్లాడుతూ కమ్యూనిస్టు ఉద్యమం ఎ ప్పటి నుంచో చెప్పినట్లుగా దేశ అభివృద్ధి అంటే కొద్ది మంది సంపద పెరగడం కా దని, ప్రజలందరికీ సమాన అవకాశాలు, సామాజిక న్యాయం, లౌకికత, రాజ్యాంగ విలువలు, శాస్త్రీయ దృక్పథం బలపడటమే నిజమైన అభివృద్ధి అని వారు ఉ ద్ఘాటించారు. ప్రజల పన్నుల డబ్బుతో నిర్మించిన ప్రభు త్వ రంగాన్ని కాపాడడం, ఖాళీ ప్రభుత్వ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయడం, విద్య, వైద్యాన్ని హక్కులుగా అమలు చేయడం, రైతు, కా ర్మిక, యువజన ప్రయోజ నాలను కాపాడే ప్రజా విధా నాలను అవలంబించడం ప్రతి ప్రభుత్వ రాజ్యాంగ బద్ధమైన బాధ్యతన్నారు. ప్ర జలు ప్రశ్నిస్తే వారిని అణచి వేయడం కాదని వారి సమ స్యలను పరిష్కరించ డమే ప్రజాస్వామ్య పాలన లక్ష ణం అని వారు అన్నారు.కానీ నేడు దేశంలో అమల వుతున్న ఆర్థిక విధానాలు ప్రజల అవసరాల కంటే కార్పొరేట్ లాభాలకు ప్రాధా న్యం ఇస్తున్నాయన్నారు. ప్ర భుత్వ రంగ సంస్థలను బల హీనపరచడం, శాశ్వత ఉద్యోగాలను తగ్గించి కాంట్రా క్టీకరణను పెంచడం, విద్య, వైద్యాన్ని వ్యాపారం గా మార్చడం, సహజ వనరులను ప్రైవేటు చేతుల్లోకి నెట్టడం వల్ల సామాన్య ప్రజలు మరింత ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. సంపద కొద్దిమంది చేతుల్లో కేంద్రీ కృతమవుతుండగా, శ్రమించే ప్రజల జీవితం మరింత భారంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నే పథ్యంలో సెప్టెంబ ర్ 8, 9, 10 తేదీలలో యాద గిరిగుట్ట, యాదాద్రి భువనగిరి జిల్లాలో జరిగే ఏఐవైఎఫ్ తె లంగాణ రాష్ట్ర 3వ మహాస భల్లో ఉపాధి, విద్య, వైద్యం, ప్రజాస్వామ్య హక్కులు, యువజన సమస్యలు, ప్రజారంగ పరిరక్షణ, సామాజిక న్యాయం వంటి కీలక అంశాలపై విస్తృతం గా చర్చించి భవిష్యత్ ఉద్యమ కార్యాచ రణను రూపొందిస్తామని వారు తెలిపారు. యువత, విద్యార్థులు, ప్రజాస్వామ్య వాదులు రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయా లని పిలుపునిచ్చా రు.ఈ విడుదల కార్యక్రమంలో ఏ ఐవైఎఫ్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ మడావి హిమ, పెందుర్ ప్రకాష్, సహాయకార్య దర్శి రమేష్, జిల్లా నాయకులు విష్ణు, ఆత్రం లావణ్య, గేడం సాగర్, మెస్రం సచిన్, ప్రవీ ణ్, దత్తు, వసంత్, దిలీప్, మహేష్, తబీరేజ్ , రామకృ ష్ణ, ప్రసాద్,రాము, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

# కేటీఆర్‌పై విరుచుకుపడ్డ ఎంపీ వంశీకృష్ణ



**మంచిర్యాల, 21, ఆగస్టు (ప్రజాజ్యోతి):**పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తు అంశాన్ని రాజకీయాలకు ఉపయోగించుకుంటూ వారిని తప్పుదారి పట్టిస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ తీవ్రస్థాయిలో శుక్రవారం విమర్శలు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా పాలిటెక్నిక్ విద్యార్థుల సమస్యలపై ఆందోళనలు కొనసాగుతున్న నేపథ్యంలో ఎంపీ వంశీకృష్ణ స్పందించారు.తెలంగాణలో గందరగోళం సృష్టించడంలో కేటీఆర్ నంబర్ వన్ అని ఆయన విమర్శించారు. గతంలో గ్లోబరీనా సంస్థ వ్యవహారంలో విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడినప్పుడు కేటీఆర్ పాత్రపై ప్రశ్నలు తలెత్తాయని ఆరోపించారు. విద్యార్థులు తమ భవిష్యత్తు కోసం ఆందోళన చెందుతున్న సమయంలో వారి సమస్యలను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించు కోవడం సరికాదన్నారు.

**పాలిటెక్నిక్ విద్యార్థులకు పూర్తి భరోసా...**

పాలిటెక్నిక్ విద్యార్థులతో ప్రభుత్వం చర్చిస్తూ వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తోందని వంశీకృష్ణ తెలిపారు. విద్యార్థుల ఉద్యోగాలు, ఉన్నత విద్యా అవకాశాల విషయంలో ప్రభుత్వం పూర్తి బాధ్యతతో వ్యవహరిస్తోందన్నారు. పాలిటెక్నిక్ విద్యార్థులకు ఇంజినీరింగ్ చదివే అవకాశాలు కొనసాగుతాయని, వారి ఉన్నత విద్యా ప్రయాణానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.సాంకేతిక విద్యను మరింత బలోపేతం చేసి తెలంగాణ యువతకు మెరుగైన అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. విద్యార్థుల భవిష్యత్తును మరింత మెరుగుపరిచేందుకు రూ. 800 కోట్ల అదనపు పెట్టుబడులు పెట్టేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. ఉపాధి అవకాశాలు పెంచడంతో పాటు ఆధునిక సాంకేతిక నైపుణ్యాలను అందించడం, ఉన్నత విద్యలో విద్యార్థులకు మరిన్ని అవకాశాలు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు.

**రాజకీయాలకు అతీతంగా విద్యార్థుల సమస్యల పరిష్కారం...**

విద్యార్థుల సమస్యలను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకోవడం మానుకోవాలని ప్రతిపక్షాలకు ఎంపీ వంశీకృష్ణ హితవు పలికారు. విద్యార్థుల ఆందోళనలను ప్రభుత్వం సానుకూలంగా పరిగణిస్తోందని, వారి భవిష్యత్తుకు భరోసా కల్పించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటుందని తెలిపారు."విద్యార్థుల కోసం మేమున్నాం.. వారి భవిష్యత్తుకు పూర్తి భరోసా ఇస్తాం" అని ఎంపీ గడ్డం వంశీకృష్ణ స్పష్టం చేశారు.

# సీఎంటీసీ, జెండర్ రీసెర్చ్ సెంటర్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే అనిల్ జాదవ్






**నేరడిగొండ ఆగస్టు 21 (ప్రజాజ్యోతి):** మండల అభివృద్ధిలో మరో కీలక ముందడుగు పడింది. ప్రజలకు మరింత మెరుగైన, నాణ్యమైన సేవలను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా నేరడిగొండ మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన 'సీఎంటీసీ' 'జెండర్ రీసెర్చ్ సెంటర్'లను బోథ్ శాసనసభ్యులు అనిల్ జాదవ్ గురువారం అధికారికంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ.. సమాజంలో మహిళలు, యువత సాధికారతకు అవసరమైన పరిశోధనలు, అవగాహన కార్యక్రమాలు మరియు వివిధ రకాల సేవలను అందించడంలో ఈ కేంద్రం ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. మారుతున్న కాలానికి, మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా ప్రజల అవసరాలను గుర్తించి, సదుపాయాలను వారి దరిచేర్చడమే తమ ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు. మండల ప్రగతి కోసం, నియోజకవర్గ సంక్షేమం కోసం ఎంతటి కష్టమైనా వెనకడుగు వేసేది లేదని పునరుద్ఘాటించారు.ఈ కర్యక్రమంలో స్థానిక సర్పంచ్ శ్రీమతి నీలిమ రవీందర్ రెడ్డితో పాటు మండల స్థాయి నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు మరియు స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## శ్యాంపూర్ లో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేసిన సర్పంచ్ దీపక్



**ఉట్నూర్, ఆగస్టు 21( ప్రజా జ్యోతి )** అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందించడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని శ్యాంపూర్ గ్రామ సర్పంచ్ దీపక్ అన్నారు. గ్రామం లోని రేషన్ షాప్ వద్ద శుక్రవారం అర్హులైన లబ్దిదారులకు నూతన స్మార్ట్ రేషన్ కార్డులను సర్పంచ్ దీపక్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. రేషన్ కార్డు కేవలం ఒక గుర్తింపు పత్రం మాత్రమే కాదని, పేద మరియు మధ్యతరగతి కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఆహార భద్రతతో పాటు అనేక ప్రయోజనాలకు ఇది కీలక ఆధారమని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి అరవింద్ ఉప సర్పంచ్ కేశవ్ ,ప్రజా ప్రతినిధులు ,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## గల్ఫ్ మృతుని కుటుంబానికి అండగా ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి.

మృతదేహాన్ని స్వదేశానికి పంపేలా చర్యలు.

సంబంధిత అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి



**సోన్, ఆగస్టు 21(ప్రజా జ్యోతి):** సొన్ మండల కేంద్రానికి చెందిన దండుగుల గంగయ్య బ్రతుకు తెరువుకోసం ఉపాధి నిమిత్తం దుబాయ్ కి వెళ్ళాడు, గత రెండు రోజుల క్రితం దుబాయ్ లో అనారోగ్య కారణంగా గంగయ్య మృతి చెందడంతో కుటుంబ సభ్యులు మరియు మండల బీజేపీ నాయకులు సమాచారాన్ని ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి దృష్టికి తీసుకు రావడంతో హుటాహుటిన స్పందించిన ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి సంబంధిత విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికారులతో, ఎన్ ఆర్ ఐ సెల్ అధికారులతో మాట్లాడి వీలైనంత త్వరగా మృత దేహాన్ని స్వదేశానికి పంపేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

## ఖానాపూర్ లో ఘనంగా వరలక్ష్మీ వ్రతాలు

ఇంటింటా ప్రత్యేక పూజలు ఆడపడుచుల వైనాలు






**ఖానాపూర్ ఆగస్టు 21 (ప్రజా జ్యోతి )** ఖానాపూర్లొ శుక్రవారం వరలక్ష్మి వ్రతాలు ఘనంగా సామూహికంగా వ్యక్తిగతంగా ఆలయాలతో పాటు ఇంటింటా ప్రత్యేక పూజలను నిర్వహించారు ప్రతి యేటా శ్రావణమాసంలో వచ్చే వరలక్ష్మి వ్రతాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో ఆడపడుచులు లక్ష్మీ అమ్మవారి చాయచిత్రం (ఫోటో) తో పాటు చిన్న లక్ష్మీదేవి విగ్రహాలకు సైతం పంచామృత అభిషేకాలు చేసి పూలు పండ్లతో పాటు ఫోటోను అలంకరించి కలిశారాధన అనంతరం లక్ష్మి అష్టోత్తర శతనామాలతో పాటు లక్ష్మీదేవి స్తోత్రాలు అష్టలక్ష్ముల వైభవాన్ని పట్టణం చేసి మంగళ హారతులు ఇచ్చి కొత్త జాకెట్ పీసులు కనుమలు పెట్టి పూజిం చడం ఆడపడుచుల ఆనవాయితీ కాగా తదుపరి చుట్టుపక్కల ముత్తైదువులను పిలిచి పసుపు కుంకుమలు సమర్పించి కాళ్లకు పారాణి రాసి లక్ష్మీస్వరూపిణిగా తలచి తమల పాకులొ గౌరమ్మతో పాటు పండ్లు గాజులు జాకెట్ ముక్కలను స్తోమతకు తగ్గట్టుగా కట్నలు వైనాలుగా సమర్పించి ఆశీర్వాదాలు తీసుకుంటారు ఈ రకంగా వరలక్ష్మి వ్రతం సందర్భంగా ఖానాపూర్ నియోజకవర్గం లోని అన్ని మండలాలు పట్టణాలు గ్రామాల్లో దేవాలయాలు సైతం మహాలక్ష్మి కొలచి ఈరోజు వరాలు అందించే తల్లిగా వరలక్ష్మిగా వ్రతాలను పూర్తి చేసుకుంటారు దీంతో ప్రతి ఆలయాలతో పాటు ఇంటింటా ఆధ్యాత్మిక శోభ కలిగింది. ఈ వ్రతాల వల్ల కుటుంబాలు శాంతి సౌభాగ్యాలు కలిగి అష్ట ఐశ్వర్యాలు కలిగి వరలక్ష్మి దేవి ఆశీస్సులతో సుఖశాంతులు కలుగుతాయి అన్న రగడ విశ్వాసం పూజలు నిర్వహిస్తారు

# పిల్ల కాకి కొండ సుస్మిత పటేల్ సీఎంపై వ్యతిరేక వ్యాఖ్యలకు మంత్రి కొండ సురేఖ బాధ్యతారహిత్యం అమానుషం

జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడమ బొజ్జు పటేల్ విలేకరుల సమావేశంలో ఘాటు విమర్శ



**ఖానాపూర్ ఆగస్టు 21( ప్రజా జ్యోతి)** తెలంగాణ రాష్ట్ర దేవాదాయ, అటవీ శాఖ మంత్రి కొండ సురేఖ కూతురు సుస్మిత పటేల్ పిల్ల కాకి వ్యాఖ్యలు సాక్షాత్ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై వ్యతిరేకంగా చేయడం పై మంత్రి కొండ సురేఖ బాధ్యతారాహిత్యం అమానుషమని నిర్మల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఖానాపూర్ శాసనసభ్యులు వెడమ బొజ్జు పటేల్ శుక్రవారం విలేకరుల సమావేశంలో ఘాటుగా స్పందించారు కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై వ్యక్తిగత వ్యాఖ్యలు చేస్తూ విమర్శించడం రాజగోపాల్ రెడ్డి చెన్నారెడ్డి లపై విమర్శలు చేస్తూనే పిల్లకాకిగా పార్టీలో ఎలాంటి బాధ్యత లేని వ్యక్తి కేవలం మంత్రి కూతురు అన్న అహంభావంతో కనీసం వయసు కు గౌరవం ఇవ్వకుండా ముఖ్యమంత్రిని కొండ సుస్మిత విమర్శించడం వెనుక అంతర్యాన్ని తప్పు పట్టాల్సిన మంత్రి సురేఖ ఆంటీఅంటనట్లు తమ కూతురు వ్యక్తిగతం అని దాటవేయడం పార్టీని దిక్కరించడమేనని బొజ్జుపటేల్ అన్నారు రేవూరి ప్రకాష్ రెడ్డి పై విమర్శలు చేస్తూనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పైనే అనుచిత వ్యాఖ్యలు కొండ సురేఖ దంపతులు కచ్చితంగా ఖండించి తీరాల్సిందేనని లేని పక్షంలో ఏఐసిసి అయితే నేమి టిపిసిసి కాంగ్రెస్ అధిష్టానం వాళ్లపై చర్యలు తీసుకోవాలని సదరు ఎమ్మెల్యేల సమక్షంలో విలేకరులతో అన్నారు ఈమధ్య సీనియర్ మంత్రులు మాజీ మంత్రులు ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు పార్టీపై విమర్శలు చేస్తూ వ్యక్తిగతంగా ముఖ్యమంత్రి పై వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని మాలాంటి కొత్తగా ఎమ్మెల్యే అయిన వ్యక్తులకు అనుభవస్తుల వ్యాఖ్యలు ఆసరాగా ఉండాలి తప్ప ఇలా పార్టీ పరువు బయటపడేలా చేయరాదని అన్నారు అలాంటి వారిపై ఖచ్చితంగా కేంద్ర రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధిష్టానలు చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డిని విమర్శిస్తే సహించేది లేదని సుస్మిత వాక్యాలు పిల్ల కాకి వ్యాఖ్యలుగా కాకుండా బాధ్యతాయుతంగా మంత్రి కొండ సురేఖ తన కూతురి బాధ్యతారహిత బాహాట విమర్శల్ని వెనక్కు తీసుకొని పార్టీకి సంజాయిషీ ఇవ్వాలని ఎమ్మెల్యే వెడమ బొజ్జు పటేల్ వ్యాఖ్యలకు పలువురు ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు మద్దతు పలికారు.

# లక్ష్మీదేవి స్వరూపంగా భావించి పూజలు నిర్వహిస్తున్న మహిళలు



**దిలావర్ పూర్ ఆగస్టు 21,( ప్రజాజ్యోతి ).**హిందూ సంప్రదాయంలో శ్రావణ మాసానికి ఎంతో విశిష్టమైన స్థానం ఉంది. ఈ పవిత్ర మాసంలో వచ్చే శుక్రవారాలకు ప్రత్యేక ప్రాధాన్యత ఉండగా, పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించడం ఆనవాయితీగా వస్తోంది. పురాణాల ప్రకారం మగధ దేశంలో చారుమతి అనే సత్ప్రవర్తన గల మహిళకు మహాలక్ష్మీ దేవి స్వప్నంలో దర్శనమిచ్చి వరలక్ష్మీ వ్రతం ఆచరించమని ఆజ్ఞాపించింది. ఆ ప్రకారం చారుమతి కలశాన్ని ప్రతిష్ఠించి, తోరం కట్టి, కుటుంబ సభ్యులు మరియు ఇరుగు పొరుగు మహిళలతో కలిసి భక్తిశ్రద్ధలతో వ్రతాన్ని నిర్వహించింది. అనంతరం ఆమె కుటుంబంలో ఆనందం, ఐశ్వర్యం, శుభసంపదలు వెల్లివిరిశాయి. అప్పటి నుంచి ఈ వ్రతం ఎంతో భక్తితో ఆచరించబడుతోంది. వరలక్ష్మీ వ్రతం కేవలం సంపద కోసం మాత్రమే కాకుండా, కుటుంబ ఐక్యత, పరస్పర ప్రేమ, ధర్మబద్ధమైన జీవన విధానాన్ని గుర్తు చేసే ఆధ్యాత్మిక సంప్రదాయం కూడా. ఈ సందర్భంగా మహిళలు ఇళ్లను అలంకరించి, ముగ్గులు వేసి, కలశాన్ని లక్ష్మీదేవి స్వరూపంగా భావించి పూజలు నిర్వహిస్తారు నైవేద్యాలు సమర్పించి, ముత్తైదువులకు తాంబూలాలు ఇచ్చి ఆశీర్వాదాలు పొందుతారు. నేటి వేగవంతమైన జీవితంలోనూ వరలక్ష్మీ వ్రతం మన సంస్కృతి, కుటుంబ విలువలు, భక్తి సంప్రదాయాలను భావితరాలకు అందించే గొప్ప ఆచారంగా నిలుస్తోంది. భక్తి, వినయం, సేవాభావంతో ఈ వ్రతాన్ని ఆచరించడం ద్వారా మన జీవితాల్లో శాంతి, భాగ్యం, సంతోషం నెలకొనాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటారు.

## హనుమాన్ ఆలయ కలశ పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే



**నేరడిగొండ, ఆగస్టు 21 (ప్రజాజ్యోతి):** మండలంలోని కోర్టికల్ గ్రామంలో శ్రీ హనుమాన్ ఆలయ కలశ పూజ కార్యక్రమం శుక్రవారం భక్తిశ్రద్ధల మధ్య వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బోథ్ శాసనసభ్యులు అనిల్ జాదవ్ ముఖ్య అతిథిగా హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణానికి చేరుకున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌కు గ్రామస్తులు, ఆలయ కమిటీ నిర్వాహకులు పూలమాలలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్ఛారణలు, మంగళ వాయిద్యాల నడుమ జరిగిన కలశ పూజలో ఎమ్మెల్యే పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హనుమంతుడి కృపతో నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాల తో ఆయురారోగ్యాల తో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఆధ్యాత్మికత, భక్తిభావం సమాజంలో ఐక్యత, సేవాభావాన్ని పెంపొందిస్తాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆలయాల అభివృద్ధికి, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు తనవంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, ఎమ్మెల్యే అభిమానులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మాల కోఆర్డినేషన్ ఫోరం జిల్లా సమీక్ష సమావేశాన్ని విజయవంతం చేయాలి



**దిలావర్ పూర్ , ఆగస్టు 21,( ప్రజాజ్యోతి ).**ఈ నెల 23 తేదీన టీఎన్జీవో భవనం లో నిర్వహించే మాల కో ఆర్డినేషన్ ఫోరం జిల్లా సమీక్ష సమావేశాన్ని విజయవంతం చేయాలని ఎంసీఎఫ్ జేపీసీ కమిటీ నాయకులు బత్తుల రంజిత్, కొంతం మురళీధర్ అన్నారు ఈ రోజు దిలావర్ పూర్ మండల లో మాల సంఘం నాయకులతో కలిసి పోస్టర్ విడుదల చేశారు ఈ సందర్భంగా నాయకులు రావుల వినేందర్, సప్పల రవి,అరుణ్,రావుల రవి, సంజు, శ్రీనివాస్, కప్పకంటి ముత్యం ,పలికరావు, వినోద్, హర్ష, రావుల పురుషోత్తం కంజర్ రాజారత్నం., బనసపల్లి, పోల పోశెట్టి సురేష్ తదితరులు ఉన్నారు

## వరంగల్ లో మోకుదెబ్బ రా ష్ట్ర కమిటీ సమావేశాన్ని జ యప్రదం చేయండి

**ఆదిలాబాద్ బ్యూరో,ఆగస్టు 21, (ప్రజా జ్యోతి )** గౌడ జన హక్కుల పోరాట సమితి ( మోకు దెబ్బ ) రాష్ట్ర కమిటీ సమావేశం ఈ నెల 23న వరంగల్లో నిర్వహిస్తున్నట్లు మోకు దెబ్బ అధ్యక్షుడు అమర వేణి న ర్సాగౌడ్ తెలిపారు. వరంగల్ జిల్లా కేంద్రంలోని పోచ మ్మ మైదన్ లోని వరంగల్ హౌస్ మినీ ఫంక్షన్ హల్ లో ఉదయం 11 గంటలకు గౌడజన హ క్కుల పోరాట సమితి మోకుదెబ్బ రాష్ట్ర కమిటీ సమావేశాన్ని నిర్వ హిస్తున్నట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్రం లోని జాతీయ నాయకులు, తెలంగాణ రాష్ట్ర కమిటీ నాయకులు, తెలంగాణ జిల్లాలలోని అన్ని జిల్లా అధ్యక్షులు, జిల్లా కార్య నిర్వాహక అధ్య క్షులు, జిల్లా ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని విజయ వంతం చేయాలని కోరారు. ఈ సమా వేశంలో సంఘ నిర్మాణం, రాష్ట్ర ప్రభుత్వం గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు, రాష్ట్ర నా యకులను జిల్లాల ఇన్చార్జి లుగా నియమించడం, భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ తదితర అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకోవడం జరుగుతుందని ఆయన పేర్కొ న్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మోకుదెబ్బ ముఖ్యనా యకులందరూ అధికసంఖ్య లోపాల్గొని సమావేశాన్ని జయప్ర దం చేయాలనికోరారు.

## పని చేసిన ఏ కార్యకర్తను మరవను

**మాజీ ఎమ్మెల్యే అజ్మీర రేఖా శ్యాంనాయక్ భరోసా**

**పలు మండలాల్లో విస్తృత పర్యటన పరామర్శలు ఆర్థిక నగదు సహాయం**



**ఖానాపూర్ ఆగస్టు 21 (ప్రజా జ్యోతి)** ఖానాపూర్ నియోజకవర్గం లో రెండు పర్యాయాలు తన కోసం పనిచేసిన ప్రతి కార్యకర్త కు అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే అజ్మీర రేఖా శ్యాంనాయక్ అన్నారు. ఈ మేరకు ఖానాపూర్ పాతుక తాలూకాలోని ఖానాపూర్ కడెం దసరా బాద్ పెంబి మండలాల్లో పర్యటించి పలువురు బాధితులను పరామ ర్శించారు ఈ మేరకు దస్తురాబాద్ కి చెందిన ఓ బాధితునికి 10వేల రూపాయల నగదు ఆర్థిక సహాయం అందజేశారు కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని ఆమె భరోసా ఇచ్చారు."నా కోసం పనిచేసిన ఏ కార్యకర్తను నేను ఎప్పటికీ మరవను. కష్టకాలంలో వారికి అండగా నిలబడటం నా బాధ్యత." అని రేఖా శ్యాంనాయక్ పేర్కొన్నారు.

## శ్రీ మహా పోచమ్మ దేవస్థానంలో బహిరంగ వేలం పాట

**సారంగాపూర్, ఆగస్టు 21 (ప్రజాజ్యోతి):** సారంగాపూర్ మండలంలోని శ్రీ మహా పోచమ్మ దేవస్థానంలో వివిధ హక్కుల బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు దేవాదాయ ధర్మాదా య శాఖ అధికారులు తెలిపారు.దేవస్థానంలో కొబ్బరికాయలు విక్రయించుకునే హక్కు, పూలు--పూజా సామగ్రి విక్రయ హక్కు, బొమ్మలు, కంకణాలు, , ఫోటోలు విక్రయించుకునే హక్కు, టోల్‌బూత్‌ల వసూలు హక్కు తదితరాలను బహిరంగ వేలం ద్వారా కేటాయించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే పిల్ల మేకల సేకరణ, కొబ్బరి ముక్కలు ప్రోగు చేసుకునే హక్కు, పూలదండలు విక్రయించుకునే హక్కు, ఇతర హక్కులు, టెండర్ వసూలు హక్కులకు సంబంధించిన వేలం ప్రక్రియ కూడా నిర్వహించను న్నట్లు తెలిపారు.కొన్ని హక్కులకు 16-09-2026 నుంచి 15-09-2027 వరకు, మరికొన్ని హక్కులకు 01-09-2026 నుంచి 31-08-2027 వరకు, టెండర్ వసూలు హక్కుకు 21-09-2026 నుంచి 20-09-2027 వరకు కాలపరిమితి ఉంటుందని అధికారులు వెల్లడించారు. ఈ మేరకు 21-08-2026న ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం పాట నిర్వ హించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. వేలం పాటలో ఆసక్తి ఉన్న వారు నిర్ణీత నిబంధనలను పాటిస్తూ పాల్గొ నాలని దేవస్థాన అధికారులు సూచించారు.ఈ కార్యక్రమంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు, దేవస్థాన సిబ్బంది, గ్రామ సర్పంచ్, గ్రామస్తులు, దేవస్థాన సిబ్బంది మరియు పాటాదారులు పాల్గొంటారని ప్రకటనలో పేర్కొన్నారు.

## ఉపాధి హామీ పనుల్లో అవకతవకలు

**వ్యవసాయ క్షేత్రాల్లో మొక్కలు నాటాలంటే సిబ్బందికి డబ్బులు ఇవ్వాల్సిందే**

**ఆదివాసి కాంగ్రెస్ జిల్లా చైర్మన్ బాణావత్ గోవింద్ నాయక్**



**ఖానాపూర్ ఆగస్టు 21( ప్రజా జ్యోతి )** నిర్మల్ జిల్లాతో పాటు ఖానాపూర్ నియోజక వర్గంలో ఉపాధి హామీ పద కంలో ఇంజనీరింగ్ కన్సల్టెం ట్లు టెక్నికల్ అసిస్టెంట్లు పనుల కేటాయింపు కొలత లు మాస్టర్ల నమోదులో అక్రమాలకు పాల్పడుతూ కూలీల నుంచి అడ్డగోలుగా వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపణలు వస్తున్నాయని ఆదివాసి కాంగ్రెస్ జిల్లా చైర్మన్ బాణావత్ గోవింద్ నాయక్ అన్నారు. జిల్లా ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడంతో క్షేత్రస్థాయిలో వీరి ఇష్టారాజ్యం పెరిగిపోయిందని అన్నారు ఉపాధి హామీలో మొక్కలు, గుంటల తవ్వకాల పేరుతో టెక్నికల్ అసిస్టెంట్ రైతుల నుండి డబ్బులు వసూలు చేసి బిల్లులు చేయకపోవడంతో చాలా ఇబ్బందులకు గురవుతున్నారు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉపాధి పనులకు ఎలాంటి నగదు వసూలు చేయకూడదు అయినప్పటికీ రైతుల దగ్గర నుండి వేల రూపా యల వసూలు చేసి సంవత్సరం గడిచిన బిల్లులు చేయకపోవ డంతో ఎవరికి చెప్పాలో అర్థం కాక రైతులు సతమతమవుతు న్నారు సరైన కొలతలు నమోదు చేయకుండా ఆన్లైన్ అప్డేట్ చేయకుండా బిల్లులు నిలిపివేయడం గంటల పరిశీలన రికార్డుల తయారీకి ముడుపులు ఇవ్వాలని ఒత్తిడి చేయడం డబ్బులు ఇస్తేనే ఫోటోలు అప్లోడ్ చేస్తామని లేదంటే బిల్లు రాదని చెప్పడంతో చేసేదేమీ లేక పలువురు రైతులు డబ్బులు ఇచ్చామని చెబుతున్నారు లంచలు ఇచ్చి సంవత్సరం గడిచిన బిల్లు రాకపోవడంతో కార్యాలయం చుట్టూ ప్రదక్షణలు చేసిన ఫలితం శూన్యమని వాపోతున్నారు జిల్లాలో పలు గ్రామాలలో క్యాటిల్ చెట్ల నిర్మాణం కోసం వేల రూపాయలు వసూలు చేసినట్లు పలువురు ఆరోపిస్తున్నారని గోవింద నాయక్ అన్నారు

## విశ్వ హిందూ పరిషత్ సారంగాపూర్ ప్రఖండ కమిటీ ఎన్నిక



**సారంగాపూర్, ఆగస్టు 21,ప్రజా జ్యోతి** విశ్వ హిందూ పరిషత్ సారంగాపూర్ ప్రఖండ కమిటీ ఎన్నికలు నిర్వహించారు. ఎవా జిల్లా కార్యదర్శి మూర్తి ప్రభు, ఎవా ఇందూర్ విభాగ్ ధర్మాచార్య సంపర్క్ ప్రముఖ్ పతికె రాజేందర్, ఎవా జిల్లా ఉపాధ్యక్షులు ముప్పిడి రవి, ఎవా నగర కార్యదర్శి జెట్టి నరేందర్ గారి ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు.విశ్వ హిందూ పరిషత్ సారంగాపూర్ ప్రఖండ అధ్యక్షులుగా ఇర్గదిండ్ల సత్యం, ఉపాధ్యక్షులుగా దోడ భోజన్న, ప్రధాన కార్యదర్శిగా మండాజి అరుణ్ చారి ఎన్నికయ్యారు.భజరంగ్ దళ్ సంయోజక్ అధ్యక్షులుగా గాంధారి రవి తేజ చారి, సహ సంయోజక్‌గా ఉడుత నవీన్, కోశాధికారిగా సామల భూమేష్, కార్యదర్శి - శ్రీ రామోజీ రాధా క్రిష్ణ,గోరక్షక్‌గా గుంజి సాయి కిరణ్, ధర్మ ప్రచార ప్రముఖ్‌గా బింగి రంజిత్, సత్సంగ్ ప్రముఖ్‌గా గుంటుకు నవీన్, సామాజిక సమరసతగా పిల్లి గంగేశ్వర్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కూనేరు భూమన్న, ఉప సర్పంచ్ అయిర కృష్ణ రెడ్డి, వార్డు మెంబర్ పిల్లి సంతోష్, సీనియర్ నాయకులు మునిమన్నల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి రూ.99 వేల మోసం

**నిందితుడిపై తలమడుగు పోలీస్ స్టేషన్ లోకేసు నమోదు**

**నిందితుడు అరెస్ట్, రిమాండ్‌కు తరలింపు**

**ఆదిలాబాద్ రూరల్ సీఐ రహీం పాషా**

**ఆదిలాబాద్ బ్యూరో,ఆగస్టు 21, (ప్రజా జ్యోతి)**ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తా నని నమ్మించి నిరుద్యోగి వ ద్ద నుంచి రూ.99,000/- తీ సుకుని మోసానికి పాల్పడి న వ్యక్తిపై కేసు నమోదు చే సినట్లు ఆదిలాబాద్ రూరల్ సీఐ రహీం పాషా తెలిపారు.

**వివరాల ప్రకారం..**

తలమడుగు మండలం ఖోడత్ గ్రామానికి చెందిన పసుపుల వెంకటేష్ గత మూడు సంవత్సరాలుగా రిమ్స్ ఆసుపత్రి, ఆదిలాబాద్‌లో ఔ ట్‌సోర్సింగ్ పద్ధతిలో అసి స్టెంట్ ఫార్మసిస్ట్‌గా పనిచేస్తు న్నాడు. 2023 మే నెలలో తన స్నేహితుడి ద్వారా కరీం నగర్‌కు చెందిన గోలి మల్లేష్ ఏ గోలి మల్లయ్య (50) పరి చయం అయ్యాడు.తాను ప్రభుత్వ ఉద్యోగాల కన్స ల్టెంట్/ఏజెంట్ గా పనిచేస్తు న్నానని, రూ.1 లక్ష చెల్లిస్తే కలెక్టరేట్ కార్యాలయం లో ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తా నని నిందితుడు నమ్మించా డు. అతని మాటలు నమ్మి న బాధితుడు 27-06-202 3న రూ.20, 000/- నగదు చెల్లించగా, 30-06-2023న రిమ్స్ ఆసుపత్రి సమీపంలో ని ఏటీఎం ద్వారా నిందితు డికి చెందిన ఖాతాలో మరో రూ.79,000/- జమ చేశాడు. మొత్తం రూ.99,000/- చెల్లించాడు. అయితే డబ్బులు తీసుకున్నప్పటికీ నింది తుడు ప్రభుత్వ ఉద్యోగం ఇ ప్పించకపోవడంతో బాధితు డు పలుమార్లు తన డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరాడు. డబ్బులు తిరిగి ఇస్తా నంటూ కాలయాపన చేసిన ప్పటికీ నగదు తిరిగి ఇవ్వక పోవడం తో బాధితుడుకు టుంబ సభ్యులతో చర్చించి పోలీసులను ఆశ్ర యించాడు. బాధితుడి ఫిర్యాదు మే రకు తలమడుగు పోలీస్ స్టే షన్లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఆదిలాబాద్ రూరల్ సీఐ రహీం పాషా తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామం టూ ఎవరైనా డబ్బులు డిమాం డ్ చేస్తే నమ్మవద్దని, అధికా రిక ప్రకటనలు నియామక ప్రక్రియను మాత్రమే నమ్మాలని సీఐ సూచించారు. ఈ కార్యక్రమంలో తలమడుగు ఎస్ఐ డి రాధిక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అంతర్రాష్ట్ర సైబర్ నేరగాళ్ల ముఠా అరెస్ట్

**సైబర్ నేరాలకు పాల్పడుతు న్న బిహారి సైబర్ ముఠా**

**నేషనల్ ఫెర్టిలైజర్స్ పేరుతో ఫ్రాంచైజీ ఇప్పిస్తామని నమ్మించి లక్షల్లో మోసం**

**నిందితులపై దేశవ్యాప్తంగా 498 సైబర్ నేరాల ఫిర్యాదులు**

**ఇప్పటివరకు 3.5 కోట్ల వర కు మోసం చేసిన నిందితులు**

**పది సెల్ ఫోన్లు, రూ 7000 0/- నగదు స్వాధీనం**

**నిందితుల బ్యాంకు ఖాతాల్లో, స్టాక్ మార్కెట్ షేర్లలో ఉన్న 8 లక్షలు జప్తు**

**విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించిన ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్**



**ఆదిలాబాద్ బ్యూరో,ఆగష్టు 21, (ప్రజా జ్యోతి )** దేశవ్యాప్తంగా సైబర్ నేరాలు చేస్తూ బీహార్ రాష్ట్రంలోతల దాచుకుంటూ అతి సామా న్యులుగా జీవిస్తూ సైబర్ నే రాలకు పాల్పడుతూ కోట్ల ల్లో మోసాలు చేసిన ఐదుగురు నిందితులను అరెస్టు చే సి రిమాండ్ కు తరలించడం జరిగిందని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్ పత్రి కా సమావేశంలో వివరాల ను వెల్లడించారు.ఈ నింది తులపై దేశవ్యాప్తంగా 500 నేరాలు పాల్పడినట్లు దాదా పు 3.5 కోట్ల వరకు ప్రజల వద్ద మోసం చేసి డబ్బులను కాజేసినట్లు తెలిపారు. ఒక తెలంగాణ రాష్ట్రంలోనే 90 సైబర్ క్రైమ్ నేరాలలో ఫిర్యాదులు అందినట్లు తెలిపారు.

**నిందితులు నేరం చేసే పద్ధతి**

ఒక నకిలీ ఫర్టిలైజర్ ఫ్రాంచై జీ ఇచ్చే వెబ్సైట్ను ఓపెన్ చే సి దేశవ్యాప్తంగా నకిలీ వె బ్సైట్ నందు అప్లికేషన్ ద్వా రా బాధితుల వివరాలను, వారి ఆధార్ పాన్, కార్డులు, బ్యాంకు ఖాతాల వివరాల ను సేకరించి విడతలవారీగా బాధితుల వద్ద వివిధ రకాల ఫీజులు, సర్వీస్ ఫీజు, లైసె న్సు ఫీజు, ట్రేడ్ ట్రాన్స్ఫర్ ఫీ జు అంటూ లక్షల్లో వసూలు చేసి మోసం చేస్తున్నట్టు తెలి పారు.అదేవిధంగా బజాజ్ లోన్ అంటూ నిందితులు, లోన్ కోసం ఆన్లైన్ లో వెతికే బాధితుల వద్ద నుండి అప్లి కేషన్ ద్వారా వారి వివరాల ను సేకరించి ఆధార్ కార్డు, పాన్ కార్డు ద్వారా వివిధ ర కాల ఫీజులు వసూలు చే స్తూ లక్షల్లో వసూలు చేస్తూ, వందల మంది బాధితులకు మోసం చేయడం జరిగిందని తెలిపారు.ఆదిలాబాద్ జిల్లా జైనథ్ పోలీస్ స్టేషన్ పరిధి లోని వ్యక్తిని "చీఫ్ఐశీఅఝశ్రీ ఖీవతీ్ఱశ్రీఱఓవతీం౯ాజ్. కాంఎ." పే రుతో నకిలీ ప్రకటన ద్వారా ఫ్రాంచైజీ ఇప్పిస్తామని న మ్మించి రూ.3,85,725/- మోసం చేయడం జరిగింది. ఈ కేసు లో నిందితులను గుర్తించి, ఐదుగురు నిందితులను అరెస్టు చేసి, రిమాండ్ కు తరలించినట్లు ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మ హాజన్ తెలిపారు.ఏఆర్ హె డ్క్వార్టర్స్లో శుక్రవారం ని ర్వహించిన విలేకరుల స మావేశంలో ఎస్పీ కేసు వివ రాలను వెల్లడించారు. భో రాజ్ మండలం మాండగడ గ్రామానికి చెందిన అకునూ రు గణేష్కు ఫ్రాంచైజీ రిజిస్ట్రేషన్ పేరుతో సైబర్ నేరగా ళ్లు ఫోన్, వాట్సాప్, ఈ మె యిల్ ద్వారా సంప్రదించారు. ఆధార్, పాన్ కార్డు, ఫొటో తదితర వ్యక్తిగత వివ రాలను సేకరించి, మొదట రిజిస్ట్రేషన్ ఫీజు పేరుతో రూ.50, 000/- చెల్లించు కున్నారు. అనంతరం లైసెన్స్, ఫ్రాంచైజీ రిజిస్ట్రేష న్, అదనపు ఛార్జీలు తదితర కారణా లు చూపుతూ పలుమార్లు డబ్బులు చెల్లించాలని ఒత్తి డి చేసి, బాధితుడి నుంచి మొత్తం రూ.3,85,725/- వి విధ బ్యాంకు ఖాతాలు,యు పిఐ, నెఫ్ట్ మార్గా ల ద్వారా బదిలీ చేయించుకున్నారు. అనంతరం నిందితులు ఫోన్ కాల్స్, వాట్సాప్ సందేశాల కు స్పందించకుండా మోసం చేయడం తో బాధితుడు సై బర్ క్రైమ్ పోలీసులను ఆశ్ర యించాడు. సాంకేతి క ఆధా రాలతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు బీహార్ రాష్ట్రాని కి చెందిన ఐదుగురు నింది తులను గుర్తించి అరెస్ట్ చేశారు.

**అరెస్ట్ అయిన నిందితుల వివరాలు:**

అబిషేక్ కుమార్ ఏ సౌరవ్ (24) విజయ్ ప్రసాద్, కుర్మీ, బహారీ–బిఘా గ్రా మం, లాల్ బిఘా పోస్ట్, కాశీచక్, నవాదా జిల్లా, బీహార్ రాష్ట్రం.ఆశుతోష్ కుమార్ ఏ బబ్లూ (33)సురేష్ ప్రసాద్, కుర్మీ బహారీ– బిఘా గ్రామం, లాల్ బిఘా పోస్ట్, కాశీచక్, నవాదా జి ల్లా, బీహార్ రాష్ట్రం.నిషు కుమార్ (25) నిరంజ న్ ప్రసాద్, కుర్మీ, హుసే నా గ్రామం, నలందా జిల్లా, బీహార్ రాష్ట్రం. రితేష్ కు మార్ (24) అభిమ న్యు ప్రసాద్, కుర్మీ, బిహారీ–బిఘా గ్రామం, లాల్ బిఘా పోస్ట్, కాశీచక్, నవా దా జిల్లా, బీహార్ రాష్ట్రం. అ భినాష్ కుమార్ (24) రాజేంద్ర ప్రసాద్, బహారీ– బిఘా గ్రామం, లాల్ బి ఘా పోస్ట్, కాశీచక్, నవాదా జిల్లా, బీహార్ రాష్ట్రం. ఈ నిందితులను అరెస్ట్ చేసి న్యాయస్థానంలో హాజరుప రచగా రిమాండ్కు తరలిం చారు.నిందితుల వద్ద నుండి పది మొబైల్ ఫోన్లను, రూ 70000 నగదును స్వాధీనం చేసుకోవడం జరిగిందని, నిందితులు బాధితుల వద్ద నుండి మోసం చేసి వసూలు చేసిన డబ్బులలో 8 లక్షల రూపాయలను బ్యాంకు ఖాతాలలో, స్టాక్ మార్కె ట్ షేర్లలో ఇన్వెస్ట్ చేసినట్లు వాటిని జప్తు చేయడం జరి గిందని తెలిపారు. ఈ సం దర్భంగా ఎస్పీ అఖిల్ మ హాజన్ మాట్లాడుతూ, ఆన్ లైన్లో కనిపించే ఫ్రాంచైజీలు, ఉద్యోగాలు, పెట్టుబడులు, లైసెన్సులు తదితర ప్ర కటనలను పూర్తిగా ధృవీక రించకుండా ఎలాంటి నగదు చెల్లింపులు చేయవద్దని ప్రజ లకు సూచించారు. సైబర్ నే రగాళ్లు పంపించే లింకులు, నకిలీ వెబ్సైట్లు, బ్యాంకు ఖాతాలు, యుపిఐ వివరాలను నమ్మి డబ్బులు బదిలీ చేయవద్దన్నారు. సైబర్ మో సానికి గురైన వెంటనే ఆల స్యం చేయకుండా 1930 సై బర్ క్రైమ్ హెల్ప్లైన్కు స మాచారం అందించాలని, స మీప పోలీస్ స్టేషన్ను సంప్ర దించాలని ఎస్పీ సూచించా రు. అంతర్రాష్ట్ర సైబర్ నేర గాళ్లను గుర్తించి అరెస్ట్ చేసి న సైబర్ క్రైమ్ పోలీసు సి బ్బందిని ఎస్పీ అభినందిం చారు.ఈ కార్యక్రమంలో ఆ దిలాబాద్ డిఎస్పీ ఎల్ జీవ న్ రెడ్డి, జైనథ్ సీఐ జి శ్రావ ణ్, ఎస్సైలు పీర్ సింగ్, గౌతం, గోపికృష్ణ, సిబ్బంది త్రిశూల్, రాజేష్, పురుషోత్తం, రవీందర్, సత్యనారాయణ సిబ్బంది తదితరులు పాల్గొ న్నారు.

# సారంగాపూర్ మండల కేంద్రంలో కోతులు, కుక్కల నివారణకు కమిటీ

**సారంగాపూర్, ఆగస్టు 21,ప్రజా జ్యోతి** మండల కేంద్రంలో కోతులు, కుక్కల బెడద నివారణకు గ్రామస్తులు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. కోతులు, కుక్కల వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులకు పరిష్కారం చూపేందుకు గ్రామస్తులు సమావేశమై కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ కమిటీకి ఎం. లక్ష్మణ్ అధ్యక్షుడిగా, సైదు చందు ఉపాధ్యక్షుడిగా, కూనపుల్ల నరసయ్య ప్రధాన కార్యదర్శిగా, రాకేష్ రాజు కోశాధికారిగా ఎన్నికయ్యారు. అలాగే బింగి రాజన్న, కొట్ట గారి నారాయణరెడ్డి, బంగ్లా రాజు, నర్సారెడ్డి, లక్ష్మన్న వీర నాగయ్య, షేక్ ఫహీం నాగయ్య, తాటి కొండ గోవర్ధన్, నవీన్, తోకల నరేష్ తదితరులు కమిటీ సభ్యులు సలహాదారులుగా ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ మండల కేంద్రంలో కోతులు, వీధి కుక్కల సమస్య రోజురోజుకూ పెరుగుతోందని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సంబంధిత అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలిపారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ సమస్య పరిష్కారం అయ్యే వరకు ఐక్యంగా పనిచేస్తామని పేర్కొన్నారు.కమిటీ ఎన్నిక కార్యక్రమంలో మండల కేంద్రానికి చెందిన పలువురు గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.



# ఆదివాసి గిరిజన గ్రామాల అభివృద్ధికి కృషి

మాజీ ఎంపీ సోయం బాపూరావు

గిరిజన గ్రామాల్లో పర్యటన



**ఆదిలాబాద్ బ్యూరో,ఆగస్టు 21, (ప్రజా జ్యోతి)** మారు మూల ఆదివాసీ గిరిజన గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి శాయశక్తుల కృ షి చేస్తానని మాజీ ఎంపీ సో యం బాపూరావు అన్నారు.ఆదిలాబాద్ జిల్లా సిరికొండ మండలం లోని మారుమూ ల ఆది వాసి గిరిజన గ్రామా లైన నేరడిగొండ, చిన్న గోధు మల్లె, పెద్ద గోధుమల్లె, నారా యణ పూర్ గ్రామాల్లో మా జీ ఎంపీ మాజీ ఎమ్మెల్యే రా జ్ గోండ్ సేవ సమితి రాష్ట్ర అధ్యక్షులు సోయంబాపూ రావు పర్యటించారు. గ్రామ స్థులతో సమావేశాలు నిర్వ హించి గ్రామాల్లో ఉన్న సమ స్యలు అడిగి తెలుసుకున్నా రు. ముందుగా సిరిచెల్మ గ్రా మంలో కొలువై ఉన్న అతి పురాతన శివాలయాన్ని ద ర్శించుకొని అక్కడి నుంచి పర్యటనను ప్రారంభించా రు. మొదటగా నేరడిగొండ జి, గ్రామ పంచాయితీలో సమావేశం నిర్వహించారు. అనంతరం నారాయణ్ పూర్ గ్రామంలో సమావేశం ని ర్వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా సోయం మాట్లా డుతూ గ్రామానికి రావడానికి రోడ్డు సౌకర్యం సరిగా లేదని, దానిని మంజూరు చేసి పూర్తి చేసే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామ న్నారు. గ్రామంలో నెలకొన్న సమస్యలు తన దృష్టికి తీ సుకురాగా పరిష్కరించే వి ధంగా కృషి చేస్తానన్నారు. గత పాలకులు గ్రామంలో ఒక్క డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కూడా ఇవ్వలేదని, కానీ ప్రజా ప్రభుత్వం ఇండ్లులేని ఆది వాసులకు 100% ఇండ్లు మంజూరు చేస్తుందన్నారు. గ్రామానికి ఇప్పటికే ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వడం జరిగిందని ఇంకా తనవంతు కృషిగా గ్రామానికి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చే పిస్తానన్నారు. వచ్చే జనవరి మాసం వరకు మరో 20 ఇం దిరమ్మ ఇండ్లను మంజూరు చేసే భాధ్యత తీసుకుంటాన న్నారు. పది సంవ్సత్సరాల్లో రేషన్ కార్డులు ఇవ్వకుండా ప్రజలను ముప్పు తిప్పలు పెట్టిందని కానీ రేవంత్ రెడ్డి సర్కారు అర్హులైన ప్రతి ఒక్క రికి రేషన్ కార్డు మంజూరు చేసి సన్న బియ్యాన్ని అంది స్తుందన్నారు. మహిళలకు ఉచిత బస్సు, ఫ్రీ కరెంటు, రెండు లక్షల రుణ మాఫీ, ఎ కరానికి 12 వేల ఆర్థిక సహా యం లాంటి ఎన్నో పథకాల ను ప్రవేశపెట్టి పేదలను ఆ దుకుంటుందన్నారు. గ్రామ కమిటీ హాల్‌ను పూర్తి చేస్తా మని, అలాగే నీటి సమస్య తీర్చేందుకు రెండు బోర్లు వే సే భాధ్యత తనదేనాన్నారు. ఈ సమావేశంలో జిల్లా గ్రం థాలయ చైర్మన్ మల్లెపూల నర్సయ్య,ఇచ్చోడ మార్కెట్ చైర్మన్ కొమరం సత్యవతి కో టేష్, కళ్లెం నారాయణరెడ్డి ఇచ్చోడ మండల పార్టీ అ ధ్యక్షులు, సిరికొండ మండల అధ్యక్షులు కంచ లక్ష్మణ్, ఇ చ్చోడ సర్పంచ్ జులై జాకు, సిరికొండ సర్పంచ్ దత్తాత్రే య, జిల్లా వైస్ ప్రెసిడెంట్ ఎ స్సీ డిపార్ట్మెంట్ జైపాల్, కొత్తూరు లక్ష్మణ్ జిల్లా ఎస్సీ డిపార్ట్మెంట్, జనరల్ సెక్రెటరీ, బోథ్ నియోజకవర్గం మై నార్టీ చైర్మన్ ముస్తఫా, బోట్ బ్లాక్ ప్రెసిడెంట్ ప్రపోల్ రెడ్డి, ఏఎంసి వైస్ చైర్మన్ శేషారా వు, మేడిగూడ సర్పంచ్, మడావి భీమ్ రావు, మల్యాల సర్పంచ్ మేస్రం దేవరావ్, బజారత్నూర్ మండల అధ్య క్షుడు, జంటి, కళ్లెం విట్టల్, నేరడిగొండ జి సర్పంచ్ పెం దూర్ గుణవంత్, ఐఎన్ టి యు సి నాయకులు మునే శ్వర్ కోటేష్, చిక్రం నాగరావ్ మాజీ సర్పంచ్, ధరంపురి స ర్పంచ్ సోయం విశ్వనాధ్, దుబార్ పెట్ సర్పంచ్ విట్ట ల్, ఇచ్చోడ మైనార్టీ అధ్యక్షు డు అబ్దుల్ రషీద్, ఏఎంసీ డైరెక్టర్ బైరి లచ్చన్న, ఆత్మ డైరెక్టర్ షేక్ గౌస్, ఎక్స్ ఎంపి టిసి ప్రవీణ్ రెడ్డి, యూత్ అ ధ్యక్షుడు క్రాంతికుమార్,మా జీ ఎంపిటిసి భీమ్ రెడ్డి, మా జీ సర్పంచ్ రాజు, సల్యాదా సర్పంచ్, తుడసం లక్ష్మణ్, అడిగాం సర్పంచ్ రేస్ పోతారెడ్డి, మాజీ మండల అధ్యక్షులు షేక్ ఇమామ్, చోలే ప్రభాకర్ జనరల్ భజరత్నూర్ మాజీ మండల్ ప్రెసిడెం ట్, జెల్ కే పాండురంగ, మా జీ జెడ్పిటిసి రఘురాం సెక్రె టరీ మధుకర్, భూతి లక్ష్మ ణ్, చంద్రశేఖర్, జగదీశ్వర్, ఇక్బాల్, జహీర్, అబ్దుల్ క రీం, ఆత్రంగంగారాం, పటేల్, మహాజన్, దేవరీ కార్యకర్త లు తదితరులు పాల్గొన్నారు.

## పలువురు బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న బి ఆర్ఎస్ అసెంబ్లీ ఇంచార్జ్ భూక్య జాన్సన్ నాయక్



**ఖానాపూర్ ఆగస్టు 21 (ప్రజా జ్యోతి )** ఖానాపూర్ ప్రతిపక్ష బి ఆర్ ఎస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జ్ భూక్య జాన్సన్ నాయక్ ఖానా పూర్ నియోజకవర్గంలోని పలు మండలాల్లో గల బాధిత కుటుం బాలను పరామర్శించి ధైర్యాన్ని కల్పించారు అనారోగ్య, రోడు ప్రమాద కుటుంబ లతోపాటు పలు కుటుంబాల్లో మరణించిన సంబంధితలను పరామర్శించి ఆర్థిక సహాయాన్ని అందజేశారు ఈ కార్యక్రమంలో బి ఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## సిరికొండ మండలంలో పర్యటించిన మాజీ ఎంపీ సోయం బాపూరావు



**సిరికొండ, ఆగస్టు 21 (ప్రజాజ్యోతి )** సిరికొండ మండలంలో మాజీ ఎంపీ సోయం బాపూరావు పలు సమస్యల గురించి శుక్ర వారం మండల కేంద్రానికి వచ్చి చిన్న గోధుమపల్లె, పెద్ద గోదాం పల్లి, నారాయణపురం గ్రామాలలో పర్యటించి అక్కడున్న నీటి సమస్య గురించి గ్రామ ప్రజలతో చర్చించి ప్రభుత్వంతో మాట్లాడి బోర్ వేసి నీటి సమస్యను తీరుస్తానన్నారు. అలాగే ఈ గ్రామాల లో ఇల్లు లేని వారికి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తాన న్నారు. ఈ కార్యక్రమంలో సిరికొండ సర్పంచ్ బొడ్డు దత్తాత్రేయ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కంచం లక్ష్మణ్ మరియు కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పరమహంస సద్గురు పూలాజీ బాబా 101వ జయంతిని ఘనంగా నిర్వహించాలి

**ఆసిఫాబాద్, ఆగస్టు 21:** కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలం పట్నాపూర్‌లో నిర్వహించనున్న శ్రీ శ్రీ శ్రీ పరమహంస సద్గురు పూలాజీ బాబా 101వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జాదవ్ అంబాజీ అధికారులను ఆదేశించారు.ఈ నెల 30వ తేదీన జరగనున్న జయంతి ఉత్సవాల నిర్వహణపై శుక్రవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవా లక్ష్మి అధ్యక్షతన సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ డేవిడ్,ఐటీడీఏ ఏ పి ఓ జనరల్ ఆత్రం భాస్కర్ పాల్గొన్నారు జయంతి ఉత్సవాలకు పెద్ద సంఖ్యలో భక్తులు, ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు ప్రణాళికతో ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు.ప్రత్యేకంగా భక్తులకు తాగునీరు, భోజన వసతి, పారిశుధ్యం, వైద్య సదుపాయాలు, పార్కింగ్, విద్యుత్, భద్రత తదితర ఏర్పాట్లపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జాదవ్ అంబాజీ సూచించారు. ఉత్సవాల సందర్భంగా భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని అవసరమైన ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని తెలిపారు.జయంతి కార్యక్రమం ప్రశాంతంగా, విజయవంతంగా జరిగేలా అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిరంతరం పర్యవేక్షించాలని ఆయన ఆదేశించారు.

## జాతీయస్థాయి రాకెట్‌బాల్ పోటీలకు అల్ఫోర్స్ విద్యార్థి

**కరీంనగర్ :** అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థి నాగ విగ్నేష్ జాతీయస్థాయి రాకెట్‌బాల్ పోటీలకు అర్హత సాధించాడు. ఇటీవల ప్రాంతీయ క్రీడా పాఠశాలలో నిర్వహించిన అంతర్‌జిల్లా పోటీల్లో ప్రతిభ కనబరిచి, తమిళనాడులో జరగనున్న జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా నిర్వహించిన అభినందన సభలో అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. క్రీడల్లో రాణిస్తే ఉన్నతస్థాయిలో అవకాశాలతో పాటు ఉపాధి అవకాశాలు కూడా లభిస్తాయని తెలిపారు. రాకెట్‌బాల్ వేగవంతమైన ఇండోర్ క్రీడగా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందుతోందని పేర్కొన్నారు. విద్యార్థులను వివిధ క్రీడా పోటీలకు ప్రోత్సహిస్తూ అవసరమైన వనరులు కల్పిస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, వ్యాయామ ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## త్రిశక్తి ఆలయంలో ఘనంగా సామూహిక కుంకుమార్చన

**మెట్ పల్లి** శ్రావనమాస శుక్రవారం రోజున స్థానిక త్రిశక్తి ఆలయంలో సామూహిక కుంకుమార్చన కార్యక్రమాన్ని ఆలయ కమిటీ వారు నిర్వహించారు. ఈ సందర్భంగా మహాలక్ష్మి, దుర్గామాత, సరస్వతీ త్రిశక్తి అమ్మవార్లకు ఉదయం పంచామృతాలతో అభిషేకం చేసి, విశేషపూజలు నిర్వహించారు. తదనంతరం మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని త్రిశక్తి అమ్మవార్లకు కుంకుమార్చన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

## బాడీ బిల్డింగ్ పేరిట ఇంజెక్షన్ల అక్రమ దందా.. నలుగురి అరెస్ట్..

**హైదరాబాద్ :** నగరంలో బాడీ బిల్డింగ్ పేరిట మెఫెంటర్‌మైన్ సల్ఫేట్ ఇంజెక్షన్లను అక్రమంగా విక్రయిస్తున్న ముఠా గుట్టురట్టైంది. టాస్క్‌ఫోర్స్ గోల్కొండ జోన్, గోషామహల్ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో నలుగురు నిందితులను అరెస్ట్ చేశారు. వీరిలో ఇద్దరు ఇంజెక్షన్ల సప్లయర్లు, మరో ఇద్దరు వినియోగదారులు ఉన్నారు. నిందితుల నుంచి రూ.1.85 లక్షల విలువైన 50 మెఫెంటర్‌మైన్ సల్ఫేట్ వాయిల్స్‌తో పాటు మొబైల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఒక్కో వాయల్‌ను రూ.160కు కొనుగోలు చేసి, దాదాపు రూ.900కు విక్రయిస్తున్నట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. ప్రధాన నిందితుడు ఉత్తర్‌ప్రదేశ్‌లోని మీరట్ నుంచి వాట్సాప్ ద్వారా ఇంజెక్షన్లను ఆర్డర్ చేసి, షాడోఫ్యాక్స్ కొరియర్ ద్వారా హైదరాబాద్‌కు తెప్పిస్తున్నట్లు గుర్తించారు.జిమ్‌లో పరిచయమైన ఇద్దరు యువకులు.. మొదట కండరాల పెంపు కోసం ఈ ఇంజెక్షన్లను వినియోగించినట్లు పోలీసులు తెలిపారు.